J/Nellore/003/2018-20 R.N.I.No.25359/74
నెల్లూరు, 25.12.2020, శుక్రవారం సంపుటి : 40 సంచిక : 30 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerpatrika.com

## ఒకే దేశం.. ఒకే ఎన్నిక

# జమిలి దిశగా అడుగులు



**భా**రతదేశంలో అసంభవం, అసాధ్యం అని అందరూ అనుకుంటుండిన జమిలి ఎన్నికలు త్వరలో రానున్నాయా..? ప్రస్తుత కేంద్ర పాలకులు అసాధ్యాన్ని సుసాధ్యం చేసి చూపించనున్నారా..? అవుననే అంటున్నారు రాజకీయ విశ్లేషకులు. భారతదేశమంతటా జమిలి ఎన్నికలు పెట్టి, ఇటు రాష్ట్రాలలోనూ అటు కేంద్రంలోను ఒకేసారి పార్లమెంటుకి, లోక్‌సభ, శాసనసభలతోపాటు స్థానిక సంస్థలకు కూడా ఎన్నికలు జరిపే ప్రక్రియకు శరవేగంగా పావులు కదులుతున్నాయన్నది వారి అభిప్రాయం.

### • సంకేతాలిస్తున్న కేంద్రం

ఇటీవల భారత దేశ ప్రధాన ఎన్నికల అధికారి సునీల్ అరోరా జమిలి ఎన్నికలకు మేము సిద్ధం అంటూ చేసిన ప్రకటన, పలు రాష్ట్రాలలో పాగా వేయడానికి భారతీయ జనతా పార్టీ చేస్తున్న ప్రయత్నంలో భాగంగా ఇప్పటి నుండే అభ్యర్థుల ఎంపిక కోసం జరుగుతున్న కసరత్తు, సాధ్యమైనంత త్వరలో నేరచరిత్ర ఉన్న రాజకీయ నాయకుల కేసులన్నిటిపైనా తుది తీర్పులు వచ్చేలా చూసి దోషులుగా నిర్ధారింపబడిన వారిని అనర్హులుగా ప్రకటించి పోటీకి దూరం చేయాలన్న కేంద్రం ఆలోచన జమిలి వార్తలకు బలాన్ని చేకూరుస్తున్నాయి.

ప్రస్తుతం దేశంలో ఎక్కడో ఒకచోట ఎన్నికలు జరుగుతుండడంతో పాలనా వ్యవస్థకు అసౌకర్యంగా ఉంటుందన్నది


(మిగతా 11వ పేజీలో)




## సంబరం.. సంరంభం



డిసెంబర్ 21వ తేదీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా తాడేపల్లిలోని ఆయన నివాసంలో జరిగిన వేడుకలో సిఎంకి శుభాకాంక్షలు చెప్పి కేక్ తినిపిస్తున్న రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి.




## జగనన్న అండగా.. కోటి మందికి

# 'ఇంటి' పండుగ

- పట్టాలను అందించడంతో పాటు ఇళ్ల నిర్మాణానికి కూడా శ్రీకారం
- కొత్తగా 17,005 కాలనీలకు రూపకల్పన 'జగనన్న కాలనీ'లుగా వాటికి నామకరణం

**రా**ష్ట్రంలో ఒక చారిత్రాత్మక ఘట్టాన్ని ఆంధ్రా ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి ఆవిష్కరించబోతున్నాడు. బహుశా భారతదేశంలోనే తొలిసారిగా అన్నట్లు పట్టాల పండుగను ప్రారంభించనున్నాడు. క్రిస్టమస్ పర్వదినం డిసెంబర్ 25 నుండి జనవరిలో పెద్దపండుగ వరకు ప్రతిరోజూ పండుగలా పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించనుంది ఆంధ్రా ప్రభుత్వం.

30లక్షల 75వేలా 755 కుటుంబాలకు ఇళ్ల స్థలాల పట్టాలను అందించడంతో పాటు వారికి శాశ్వత గృహాలు నిర్మించే కార్యక్రమానికి కూడా శ్రీకారం చుట్టబోతోంది ప్రభుత్వం. ప్రతి పేదవాడికి సొంతిల్లు ఉండాలి అంటూ తన సుదీర్ఘ పాదయాత్రలో పదే పదే చెప్తూ, తాను అధికారంలోకి వస్తే అది నెరవేరుస్తానంటూ చేసిన వాగ్దానానికి కట్టుబడి తొలి అడుగు వేయబోతున్నాడు సియం.

గ్రామీణ ప్రాంతాల వారికి ఒకటిన్నర, పట్టణాలలో వారికి ఒక సెంటు చొప్పున ఈ భూ పంపిణీ జరుగుతుంది. ఇందుకోసం రాష్ట్ర వ్యాప్తంగా తొలి దశలో 68,361 ఎకరాలను ప్రభుత్వం సేకరించింది. ఈ భూమి విలువ ప్రభుత్వ మార్కెట్ వాల్యూ ప్రకారం 23 వేలా 535 కోట్లు. ఈ స్థలాల్లో 50.940 కోట్ల ఖర్చు అంచనాలతో రెండు దశల్లో 28.30 లక్షల ఇళ్ల నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేసుకుని మొదటి దశలో 28.080 కోట్ల అంచనా ఖర్చుతో 15.60లక్షల ఇళ్ల నిర్మాణానికి డిసెంబర్ 25న భూమిపూజ చేసి ప్రారంభించడంతో పాటు ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న 17,005 కొత్త కాలనీలకు 'జగనన్న కాలనీలు'గా నామకరణం చేయబోతున్నారు. వీటితోపాటు ఇప్పటికే నిర్మాణం పూర్తై వున్న టిడ్కో గృహాలకు సంబంధించిన సేల్ అగ్రిమెంట్లను కూడా ప్రభుత్వం అందించనుంది.

### చెప్పింది చేయాల్సిందే..! తండ్రి బాటలో తనయుడు

దివంగత మహానేత డాక్టర్ వైయస్ రాజశేఖరరెడ్డి లక్షణాలు పుణికి పుచ్చుకున్నాడు జగన్. తన తండ్రి ఎవరికైనా మాట ఇచ్చాడంటే

(మిగతా 10వ పేజీలో)

### కొత్త కరోనా రాకుండా..

# ముందస్తు జాగ్రత్తలు

## అప్రమత్తమైన జిల్లా అధికార యంత్రాంగం

రంగులు మార్చుకుంటూ మరిన్ని విషపు కోరలు పెట్టుకుని కరోనా మహమ్మారి ప్రపంచ ప్రజల్ని బెంబేలెత్తిస్తున్న నేపథ్యంలో జిల్లాకు ఈ కొత్త కరోనా ఎక్కడ దాపురిస్తోందని అధికారులు అప్రమత్తమయ్యారు. కరోనా తగ్గుముఖం పట్టిందని అనుకుంటున్న సమయంలో ఇప్పుడీ కొత్త కరోనా ఎక్కడ వ్యాపిస్తుందోనని ప్రజలు భయపడుతున్నారు. ఇప్పటికే జిల్లాలో కరోనా వ్యాధి 63,541 మందికి సోకి వారిని నానా యాతనలకు గురిచేసింది. వైద్యుల చికిత్సలతో 62419 మంది కోలుకుని ఆసుపత్రుల నుంచి ఇళ్ళకు వెళ్ళినా, 587మంది మృతిచెందడం బాధాకరం. ఇప్పుడు కొత్త కరోనాని నివారించేందుకు జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు, అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ఐటిడిఓ మణికుమార్ ఆధ్వర్యంలో నలుగురు సభ్యులతో కూడిన బృందంతో చెన్నై ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టులో ఎప్పటికప్పుడు కరోనా సమాచారం తెలుసుకుని జాగ్రత్తలు తీసుకునేలా హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేయడం జరిగింది. బ్రిటన్‌లో కరోనా కొత్త రూపంలో స్ట్రెయిన్ వైరస్‌గా రూపాంతరం చెంది విజృంభిస్తున్న నేపథ్యంలో ఆ దేశం నుంచి భారతీయులు స్వస్థలాలకు తిరిగి వస్తున్నారు. దీంతో బ్రిటన్ నుంచి నెల్లూరుకు వచ్చే ప్రయాణీకులను గుర్తించి వారికి కొత్తరకం కరోనా వైరస్ లక్షణాలేమైనా ఉన్నాయా అని పరిశీలించి, అవసరమైతే అక్కడనే వారిని క్వారంటైన్‌లో ఉంచడం వంటి ముందుజాగ్రత్తలు తీసుకుంటున్నారు.



### మన సతీష్‌రెడ్డి నేతృత్వంలో..

# త్వరలోనే కోవిడ్ డ్రగ్స్

భారత రక్షణ, పరిశోధన అభివృద్ధి సంస్థ (డిఆర్‌డిఓ) ఛైర్మెన్, మన నెల్లూరీయుడైన ప్రఖ్యాత శాస్త్రవేత్త గుండ్రా సతీష్‌రెడ్డి సారధ్యంలో కోవిడ్ బాధితులకు అవసరమైన కొత్త ఔషధాన్ని సిద్ధం చేస్తున్నారు. దేశ రక్షణ రంగంలో సైన్యానికి కావాల్సిన పరికరాల తయారీలో ముందడుగు వేస్తుండడమే కాక, దేశంలో సామాన్య ప్రజలకు ఉపయోగకరమైన కొత్త ఆవిష్కరణలు కూడా డిఆర్‌డిఓ ఆధ్వర్యంలో జరుగుతుండడం విశేషం. తాజాగా 2 డిజి పేరుతో కోవిడ్ డ్రగ్స్‌ను త్వరలోనే అందుబాటులోకి తీసుకువచ్చేందుకు డిఆర్‌డిఓ కృషి చేస్తుండడం అభినందనీయం. కోవిడ్ రోగులకు ఈ మందు ఇస్తే త్వరగానే వైరస్ ప్రభావం తగ్గుతుందని, దీనికి సంబంధించి మూడో దశ క్లినికల్ ప్రయోగాలు ఇప్పుడు ముగింపు దశకు వచ్చాయని డిఆర్‌డిఓ ఛైర్మెన్ సతీష్‌రెడ్డి చెప్పారు. ఈనెల 22న హైదరాబాద్‌లోని ఈఎస్ఐ ఆసుపత్రిని సందర్శించిన తర్వాత ఆయన వైద్యకళాశాల విద్యార్థులతో ఆన్‌లైన్ ద్వారా మాట్లాడుతూ ఇది థెరపిక్ డ్రగ్ అని, కోవిడ్ నుంచి కోలుకున్నప్పటికీ ఆరోగ్యపరంగా ఇబ్బందులు పడుతున్నవారికి ఈ డ్రగ్ ఇవ్వడం ద్వారా ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ లేకుండా కోలుకుంటారని తెలిపారు. ఈ డ్రగ్ ఫిబ్రవరిలోగా అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందన్నారు. కోవిడ్ వ్యాప్తిని అరికట్టేందుకు డిఆర్‌డిఓ, ఇఎస్ఐసి సంస్థలు కలసి పనిచేస్తున్నాయని, వైద్య పరికరాలను తక్కువ ధరలకే సాధారణ ప్రజలకు అందించేందుకు కూడా డిఆర్‌డిఓ కృషి చేస్తోందని చెప్పారు. ఈ కరోనా కష్టకాలంలో డిఆర్‌డిఓ ఆధ్వర్యంలో ప్రజలకు ఎంతో ఉపయోగకరమైన శానిటైజర్లు, పిపిఇ కిట్‌లు, వెంటిలేటర్ల వంటి అత్యాధునిక వైద్యపరికరాలను తక్కువ ధరలకే అందుబాటులో ఉండేలా తయారు చేశామని వివరించారు.

### సంక్షేమం పేరుతో

# ప్రజాధనం లూటీ

**- బీద రవిచంద్ర విమర్శ**




వైకాపా ప్రభుత్వం సంక్షేమం పేరుతో ప్రజాధనాన్ని లూటీ చేస్తోందని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర విమర్శించాడు. ఈనెల 20 ఆయన వెంకటగిరిలోని టిడిపి కార్యాలయంలో పార్టీ నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశంలో మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో అస్తవ్యస్తపాలన సాగుతోందన్నాడు. టిడిపి శ్రేణులను భయపెట్టడమే జగన్ ప్రభుత్వం పనిగా పెట్టుకుందన్నాడు. ప్రభుత్వ యంత్రాంగం అండతో అవినీతికి పాల్పడుతున్నారంటూ వైకాపా నాయకులను దుయ్యబట్టారు. టిడిపి పాలనలో జరిగిన అభివృద్ధిని నాయకులు, కార్యకర్తలు ప్రజల వద్దకు వెళ్ళి వివరించాలని కోరాడు. తిరుపతి ఉప ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి పనబాక లక్ష్మికి విజయం తథ్యమని ఆయన ధీమాగా చెప్పాడు. టిడిపి నాయకులు జన్ని రమణయ్య, పోలంరెడ్డి వెంకటరెడ్డి, ఏలేశ్వరం రామచంద్రయ్య, బీరం రాజేశ్వరరావు, కెవికె ప్రసాద్‌నాయుడు, రాఘవరెడ్డి పాల్గొన్నారు.

### బాలికలను

# తప్పకుండా చదివించాలి

పేదరికం కారణంగా కుటుంబానికి చేదోడుగా ఉంటారని కొంతమంది తమ పిల్లలను పనులకు పంపుతూ చదువుకు దూరంగా ఉంచుతుంటారు. అది మంచి పద్ధతి కాదు. బాలికలందరినీ తప్పనిసరిగా చదివించుకోవాలి, వారు బడులకు వెళ్ళేలా తల్లిదండ్రులకు అవగాహన కలిగించాలంటూ జిల్లా బాలల సంరక్షణాధికారి సురేష్ చెప్పారు. ఈనెల 22న ఆత్మకూరులో 'బేటీ బచావో.. బేటీ పడావో' నూరురోజుల మహిళామార్చ్ సందర్భంగా డివిజన్ స్థాయిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహిళా సాధికారతే ధ్యేయంగా ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలుచేస్తోందని, వాటిని అర్హులైనవారందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మహిళా సఖి అధికారి జ్యోత్స్న, సిడిపిఓ ఉషారాణి, ఆత్మకూరు తహశీల్దార్ సుభద్ర తదితరులు పాల్గొన్నారు.



## నాన్నకు నివాళి

క్రిస్టమస్ పర్వదినం సందర్భంగా మూడురోజుల పాటు సొంత జిల్లా కడపకు వెళ్లిన ముఖ్యమంత్రి గురువారం ఉదయం ఇడుపులపాయలోని తన తండ్రి స్మారకం వద్దకు వెళ్లి దివంగత మహానేత వైయస్ రాజశేఖరరెడ్డి గారి దివ్యస్మృతికి నివాళులర్పించాడు.

## రాష్ట్రానికి కొత్త ముఖ్య కార్యదర్శి

ఆంధ్రప్రదేశ్ ప్రస్తుత ముఖ్యకార్యదర్శి శ్రీమతి నీలం సాహ్ని స్థానంలో కొత్త ముఖ్యకార్యదర్శిగా ఆదిత్యనాథ్ దాస్ నియమింపబడ్డాడు. బుధవారం ఆయన తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో డిజిపి గౌతమ్ సవాంగ్‌తో సహా ముఖ్యమంత్రి వైయస్ జగన్‌ను కలిసి కృతజ్ఞతలు తెలియజేశాడు. ప్రస్తుత సిఎస్ నీలం సాహ్ని ఈ నెల 31న పదవీ విరమణ చేయనుండగా, ప్రభుత్వం ఆమెని ముఖ్య సలహాదారుగా నియమించుకుంది. ఆదిత్యనాథ్ దాస్‌కి నెల్లూరుతో చిరకాల పరిచయం ఉంది. తెలుగుగంగ ప్రత్యేక కలెక్టర్‌గా ఆయన నెల్లూరులో పనిచేశాడు.




## ఆత్మీయ ఆవిష్కరణ



**'లాయర్' 2021 క్యాలెండర్ ఆవిష్కరణ :** చిట్టి పొట్టి చిన్నారులతో అత్యంత ఆకర్షణీయంగా 'లాయర్' రూపొందించిన 2021 క్యాలెండర్‌ను హైదరాబాదులోని తన నివాసంలో డిసెంబర్ 20వ తారీఖున ఆవిష్కరించిన శాంత బయోటెక్నిక్స్ వ్యవస్థాపక చైర్మెన్ కె.ఐ.వరప్రసాద్‌రెడ్డి. పక్కనే తుంగా శివప్రజిత్‌రెడ్డి.

## కొత్త కోరలతో కలవరపెడుతున్న కరోనా

### ➢ ప్రపంచానికి దడ పుట్టిస్తున్న వైరస్‌లు



కరోనా ఎంతో కొంత తగ్గిందని, కొత్త సంవత్సరమైనా జనజీవితాలు శుభప్రదంగా సాగాలని ప్రపంచమంతా కోరుకుంటున్న నేపథ్యంలో కరోనా మహమ్మారి తన రూపు మార్చుకుని కొత్త కోరలతో మానవాళిని భయపెడుతోంది. ప్రపంచవ్యాప్తంగా కరోనా ప్రకంపనలు సృష్టిస్తోంది. ఇటీవలే బయలుదేరిన ఈ కొత్త కరోనా ధాటికి బ్రిటన్ బెంబేలెత్తిపోతోంది. ఇప్పటికే ఇటలీకి పాకిన ఈ వైరస్ ప్రపంచదేశాలన్నిటినీ వణికిస్తోంది. ప్రపంచమంతా ఊపిరి బిగపట్టుకుని మళ్ళీ మరింతగా అప్రమత్తమవుతూ ఉంది. ముందుజాగ్రత్త చర్యగా బ్రిటన్‌కు విమాన సర్వీసులను రద్దు చేసుకుంటున్నాయి. బ్రిటన్‌తో సరిహద్దులను మూసివేస్తున్నట్లు ఫ్రాన్స్ ప్రకటించింది. మనదేశంలో కూడా మార్పు చెందిన ఈ కరోనా వైరస్ వ్యాప్తిని అరికట్టేందుకు భారత ప్రభుత్వం కృషి చేస్తోంది. ఈ వైరస్‌లకు సంబంధించి రకరకాల కథనాలు ప్రపంచవ్యాప్తంగా వెల్లువెత్తుతున్నాయి. కరోనా వైరస్ జన్యువులను స్వల్పంగా మార్చుకోవడంతో బ్రిటన్‌కు మరో కొత్త ముప్పు కూడా ఎదురవుతోందని, దక్షిణాఫ్రికాలో రూపాంతరం చెంది అక్కడ తీవ్రస్థాయిలో విజృంభిస్తున్న మరో రకం కోవిడ్ వైరస్ కూడా మరో మహమ్మారిలా దాపురిస్తోందని కథనాలు మరింత కలవరం కలిగిస్తోంది. వీటిలో ఏది ఎంత ప్రమాదకరమో ఇంకా పూర్తిస్థాయిలో నిర్ధారణ కాకపోయినా అసలు వైరస్‌ల మాటెత్తితేనే ప్రజలు వణికిపోతున్నారు. ఏదేమైనా ఇంకొద్దిరోజుల్లోనే కొత్త సంవత్సరం వస్తున్న శుభతరుణంలోనైనా ఈ వైరస్‌ల ముప్పు తప్పిపోవాలని ప్రజలంతా ఆకాంక్షిస్తున్నారు.

## మాగుంట లేఅవుట్‌లో ప్లాట్లకు నిషేధిత జాబితా నుండి విముక్తి

- ఆదేశాలిచ్చిన హైకోర్టు

మాగుంట లే అవుట్‌లో యస్ఆర్‌కె స్కూలునుండి పిచ్చిరెడ్డి కళ్యాణమండపం వరకు సర్వేనంబరు 618/2లో వున్న నిషేధిత ప్లాట్లకు విముక్తి లభించింది. వీటిని వెంటనే నిషేధిత జాబితాలోనుండి తొలగించాలని ఆంధ్రప్రదేశ్ అత్యున్నత న్యాయస్థానం నెల్లూరు సబ్‌రిజిస్ట్రార్‌ని ఆదేశించింది. ఈ భూములు వక్ఫ్ బోర్డుకు చెందినవని వీటి రిజిస్ట్రేషన్ ఆపేయాలని కొంతమంది అభ్యర్ధన మేరకు సబ్‌రిజిస్ట్రార్ 618/2 సర్వేనంబరును నిషేధిత జాబితాలో ఉంచారు. ఇవన్నీ తమ సొంత భూములని వక్ఫ్ బోర్డు తమపై అక్రమకేసు వేసి వరుసగా 1973, 1978, 1984 మళ్ళీ 2013లో ఇప్పటికి 4సార్లు కేసు ఓడిపోయిందని, ఈ సర్వే నంబర్‌లోని స్థల యజమానుల తరపు న్యాయవాది ఆధారాలతో సహా నిరూపించడంతో తక్షణమే సదరు సర్వేనంబరు 618/2ని నిషేధిత జాబితాలోనుండి తొలగించాలని న్యాయస్థానం ఆదేశించింది. తమ ఆస్తులను కాపాడుకోవడం కోసం దీర్ఘకాలంగా స్థల యజమానులు చేస్తున్న పోరాటం ఎట్టకేలకు ఫలించింది.


అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు


## ఆటలు మొదలయ్యాయి..

- అన్నీ మాగుంటోళ్ళ హాళ్ళే



దాదాపు 9నెలల విరామం తరువాత డిసెంబర్ 24వ తేదీ గురువారం నెల్లూరులో సినిమాహాళ్లు తెరుచుకున్నాయి. కొద్ది రోజుల క్రితమే న్యూటాకీస్, వినాయక, సిరి వంటి కొన్ని హాళ్లు తెరుచుకున్నప్పటికి అక్కడికి మామూలు మనుషులు ఎవరూ వెళ్ళరు. ఇప్పుడు మాగుంట వారి ఆధ్వర్యంలో నడుస్తున్న యస్2 సినిమాహాళ్ళకు ఇప్పుడు యం1గా పేరు మార్చారు. అలాగే వారి ఆధ్వర్యంలో యంజిబి మాల్‌లో నడిచే స్క్రీన్‌లకు 'స్పైస్ సినిమాస్'గా నామకరణం చేశారు. వీటితో పాటుగా లీలామహల్ కూడా గురువారం నుండి తెరుచుకుంది. అర్చన ఇక ఎప్పటికీ తెరుచుకోదు. ఇక్కడ 9th స్ట్రీట్ పేరుతో షాపింగ్ మాల్ వస్తున్న విషయం తెలిసిందే! ఇక నర్తకి కూడా అనుమానమే. ఇదికూడా త్వరలో రిలయన్స్ హైపర్ మాల్‌గా మారబోతోందని వార్తలొస్తున్నాయి. యంజి మాల్‌లో వున్న 5 స్క్రీన్‌లు, యం1లో ఉన్న 3స్క్రీన్‌లతో పాటు లీలామహల్‌ని కలుపుకుని 9 హాళ్లు ఇప్పుడు మాగుంటోళ్ళవే. మూడుహాల్లోళ్లుగా నెల్లూరీయులకి పరిచయమైన మాగుంట కుటుంబం ఆధ్వర్యంలోనే ఇప్పుడు 9 హాళ్లు నడుస్తున్నాయి.

గురువారం ఒక్కసారిగా తెరుచుకున్న హాళ్లలో ఊహించని విధంగా ప్రేక్షకులు రావడం ఆశ్చర్యపరిచిందంటున్నారు హాళ్ల నిర్వాహకులు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం కరోనా విషయంలో అన్ని ముందు జాగ్రత్తలు తీసుకుని హాళ్ళని ప్రారంభించామని వారు చెప్తున్నారు. జనం సినిమాలకు ఎగబడడం చూస్తే కరోనా వుంది... భయం మాత్రమే పోయిందన్నది స్పష్టమైపోతుంది.




## 'ప్రభా'తం

# అదరగొడుతున్న ధరలు

దేశంలోని పలు రాష్ట్రాల్లో కొన్ని పంటలకు గిట్టుబాటు ధరలను ప్రకటించినా అవి ఆచరణలో సక్రమంగా రావడం లేదంటూ రైతులు ఆవేదన చెందుతున్నారు. కొన్ని రాష్ట్రాల్లో నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగిపోయి ప్రజలు బాధలు పడుతున్నారు. తాజా పరిణామాల్లో పంజాబ్, బీహార్ వంటి రాష్ట్రాల్లో కూరగాయల ధరలు మరీ తగ్గిపోయి రైతులు లబోదిబోమంటున్నారు. ఇకనైనా ఈ సమస్యలను పరిష్కరించాలి. వెంటనే ధరలను క్రమబద్ధీకరించాలి. కేంద్రంతో పాటు అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలు అందుకు సమగ్రమైన ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలని అందరూ కోరుకుంటున్నారు.

అదేమి దురదృష్టమో తెలియదు కానీ..మనదేశంలో రానురాను పేదలు, మధ్యతరగతి ప్రజలది ఎప్పుడూ కష్టాల కాపురమే అయిపోతోంది. ఏం కొనాలన్నా, ఏం తినాలన్నా కష్టంగానే ఉంటోంది. అదరగొడుతున్న ధరలతో సామాన్యులు పడే అవస్తలకు అంతే లేకుండా పోతోంది. ఏళ్ళు గడిచిపోతున్నా దేశంలో ఒక సమగ్రమైన, సముచితమైన ధరల నియంత్రణ విధానమన్నది లేకపోవడంతో దేశంలో ధరలదే ఇష్టారాజ్యమైపోయింది. కొన్నిచోట్ల ధరలు ఆకాశానికి ఎగిరిపోతుండడం, మరికొన్ని చోట్ల పాతాళానికి దిగిపోతుండడం సర్వసాధారణమైపోతోంది. దీంతో అటు వినియోగదారులు, ఇటు పంటలు పండించే రైతులు పడే బాధలు వర్ణనాతీతం. ఆరుగాలం శ్రమించి కాయకష్టం చేసి పంటలు పండించే అన్నదాతలకు సరైన గిట్టుబాటు ధరలు లేక సతమతమైపోతుంటే 'కాకి అరుస్తూనే ఉంటుంది..కరవాడ ఎండుతూనే ఉంటుందన్న' సామెతగా నాయకులు మాత్రం తమ రాజకీయాలు తమవే అన్నట్లుగా ఉండడం రైతుల్లో ఆవేదనకు.. ఆందోళనకు దారితీస్తున్నాయి.

దేశంలో అనేక రాష్ట్రాల్లో అనేక పంటలకు గిట్టుబాటు ధరలు ఉన్నా అవి సక్రమంగా అమలులోకి రాకపోతుండడం, నిత్యావసర సరుకుల ధరలు భగ్గుమని మండిపోతుండడం, కొన్ని రాష్ట్రాల్లో కొన్ని రకాల పంటలకు అసలు ధరలే లేక వీధుల్లో పారబోసుకోవాల్సిన దుస్థితి రావడం విచిత్రం. అయినా ప్రభుత్వాలు, పాలకులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతూనే ఉన్నాయి. తాజాగా కొత్త సాగు బిల్లులపై దేశంలోని అనేక రాష్ట్రాల రైతులు రోడ్లెక్కి ఉద్యమాలు చేస్తూనే ఉన్నా నేటికీ ఆ విషయంలో ఇంకా చర్చలు ఒక కొలిక్కి రాకపోవడం విచారకరం. ఎంతటి సమస్యలనైనా సామరస్యంగా కూర్చుని చర్చించుకుంటే పరిష్కరించుకోవచ్చనే విషయం అందరికీ తెలిసినా అటు రైతు నాయకులు కానీ, ఇటు ప్రభుత్వం కానీ ఇంకా సరైన పరిష్కారపు దిశగా చర్చల దారిలోకి రాకపోవడం బాధాకరం. ఇదిలా ఉంటే ఇంతకంటే మంచి సమయం రాదన్నట్లుగా ధరలు అదును చూసుకుని మరీ అదరగొట్టేస్తున్నాయి. కొన్ని రాష్ట్రాల్లో ఇటీవల వర్షాలు బాగా కురిసి పంటలు అనుకున్నదానికంటే బాగా పండినా ధరలు మాత్రం తగ్గడమే లేదు. ధాన్యం విరగపండినా బియ్యం ధర ఆకాశంలోనే ఉంది. నూనెలు, పప్పులు, చివరికి ఎరగడ్డల వంటి నిత్యావసర ధరలన్నీ పేదలు కొనలేనంతగా పెరుగుతూనే ఉన్నాయి. నల్లబజారులో సరుకులు విపరీతమైన ధరలకు విక్రయించేవారికి, సరుకులను దాచిపెట్టి కృత్రిమ కొరతను సృష్టించి ధరలు పెంచి అమ్ముకునేవారికి, రైతులను అన్నివిధాలుగా మాయచేసి మోసం చేసి దోచుకునే దళారులకు, ధనార్జనే ధ్యేయంగా వ్యాపారాలు చేసే వ్యాపారులకు మనదేశంలో కొదవుండడం లేదు. ప్రభుత్వాలు కొన్ని పంటలకు మద్దతు ధరలు ప్రకటించినప్పటికీ అవి సక్రమంగా ఆచరణలోకి రావడం లేదు. ఇలాంటి అన్యాయాలను అరికట్టేందుకు ప్రభుత్వాల వద్ద కఠిన చట్టాలే ఉన్నా అవి కూడా ఆచరణలోకి వచ్చేది అంతంత మాత్రమే కావడంతో తమ పరిస్థితి దయనీయంగా ఉందంటూ దేశంలోని అనేక ప్రాంతాల రైతులు వాపోతున్నారు. రైతులు దేశానికి వెన్నెముక అంటూనే వారికి సరైన గిట్టుబాటు ధరలు లేకుండా, వారు పడిన కష్టానికి తగ్గ ఫలితం అందివ్వలేని పరిస్థితుల్లో సేద్యంపైనే విరక్తి చెందుతున్న రైతులెంతోమంది ఉన్నారు.

ఇలాంటి పరిస్థితుల్లో వ్యాపారులు, దళారుల దయాదాక్షిణ్యాల మీదనే తాము పండించిన ఉత్పత్తులను అమ్ముకోవాల్సిన దుస్థితి నుంచి మనదేశంలో రైతులు ఇంకెంత కాలానికి బయటపడతారో ఆ భగవంతునికే ఎరుక. నిత్యావసర సరుకులకు కొరత లేకుండా చూడడం, ప్రతి వస్తువుకు సముచితమైన ధరలను నిర్ణయించి ప్రజలకు ఇబ్బంది లేకుండా అమలు చేయడం వంటి విషయాల్లో ప్రభుత్వాలు ఆశించినంతగా శ్రద్ధ తీసుకోవడం లేదు. దీంతో ఏ వస్తువు ధర ఎప్పుడు ఎంత పెరుగుతుందో ఎవరికీ అంతుపట్టని విషయంగా మారుతోంది. వ్యాపారులు ఎంత చెప్తే అదే ధరై పోతుంది. అటు రైతులకు నష్టం జరగకుండా ఇటు ప్రజలకు భారం కాకుండా సక్రమమైన ధరల విధానం లేకపోవడం వల్ల కలిగే కష్టాలివి. దేశంలో ధరలు ఇలా చిత్తం వచ్చిన రీతిలో పెరిగిపోయి కొన్ని రాష్ట్రాల్లో జనం బెంబేలెత్తుతోంటే పంజాబ్, బీహార్ వంటి రాష్ట్రాల్లో కూరగాయల పంటల ధరలు కుదేలైపోవడంతో రైతులు దిగాలు పడిపోతుండడం గమనార్హం. తాజా పరిణామాల నేపథ్యంలో ఆ రాష్ట్రాల్లోని అనేక ప్రాంతాల్లో రైతులు తమ కూరగాయల పంటలకు కనీసపు ధరలు లేకపోవడంతో పండించిన పంటలనంతా నేలపాలు చేసేస్తున్నారు. ఢిల్లీలో రైతులు ఆందోళనలు చేస్తున్న నేపథ్యంలో పంజాబ్, బీహార్ తదితర రాష్ట్రాల నుంచి రావాల్సిన కూరగాయలు రాకపోవడంతో ఇదే అదనుగా స్థానికంగా ఉండే మార్కెట్లలోకి కూరగాయలు కుప్పలుగా వచ్చిపడుతుండడంతో కూరగాయల ధరలు బాగా తగ్గిపోయాయి. దీంతో ఆ రాష్ట్రాల రైతులు టమోటా, ఎరగడ్డలు, క్యాబేజీ, కాలీఫ్లవర్ వంటి పంటలకు కనీసపు ధరలు కూడా రాక తోటల్లోనే వదిలేస్తున్నారు కూడా. అప్పోసప్పో చేసి పంటలు పండించుకున్న రైతులకు చివరికి పంట కోసినందుకు ఇచ్చే కూలీధరలు, రవాణాకు పెట్టే ఖర్చులు కూడా చేతికి రాకపోవడంతో రైతులు ఎక్కడంటే అక్కడ కూరగాయలను రోడ్లమీదనే కుప్పలుగా పారబోస్తున్నారు. తమకు కనీస గిట్టుబాటు ధర నిర్ణయించి పటిష్టంగా వాటిని అమలుచేసి ఆదుకోవాలని రైతులు కోరుకుంటున్నారు.

ఇకనైనా ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులు, రైతు నాయకులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యాపారవర్గాల వారు, మేధావులు అందరూ కలసి దేశంలో పెరిగిపోతున్న ధరలను క్రమబద్ధీకరించేందుకు, గిట్టుబాటు ధరలను పటిష్టంగా అమలుచేసేందుకు సమగ్రమైన ప్రణాళికలు రూపొందించి అమలుచేసేందుకు కృషిచెయ్యాలని ప్రజలంతా కోరుకుంటున్నారు. కేంద్రంతోపాటు అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలు అందరినీ బెంబేలెత్తిస్తున్న ఈ ధరల విషయాన్ని బాగా చర్చించి ప్రజలందరికీ అనువైన విధంగా సత్వరం సముచితమైన నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# మద్యం ధరలు తగ్గించొచ్చు కదా..!

ఇతర రాష్ట్రాల నుండి ఆంధ్రాలోకి వస్తుంటే సరిహద్దు వద్ద పోలీసుల హడావుడి ఎక్కువగా ఉంది. కుటుంబ సమేతంగా వస్తున్నా కూడా వాహనాలు మొత్తం జల్లెడ పడుతున్నారు. మీ కార్లో మద్యం ఉందా అంటూ మహిళలను కూడా ప్రశ్నిస్తున్నారు. ఇతర రాష్ట్రాలలో అమ్మే మద్యం ధరలతో పోలిస్తే మన రాష్ట్రంలో ధరలలో పెద్దగా వ్యత్యాసం లేదు. మరి అలాంటప్పుడు ఇతర రాష్ట్రాలతో సమానంగా మన రాష్ట్రంలోకూడా ధరలు పెడితే అసలు ఈ పోలీసు ప్రహసనాలకి అవకాశమే ఉండదు కదా...? ఒక వేళ మద్య పానం నిషేధమే ప్రభుత్వ లక్ష్యమైతే నిషేధించిన నాటినుండీ ఈ బందోబస్తులు చేసుకోవచ్చు కదా. కర్ణాటకతో పోలిస్తే మన రాష్ట్రంలోనే ధరలు తక్కువ. తెలంగాణ, తమిళనాడు, ఒరిస్సా రాష్ట్రాలతో పోల్చిచూస్తే స్వల్పతేడా వుంది. కానీ సమస్యల్లా బ్రాండ్లతోనే వస్తుంది. ఆంధ్రాలో ఎవరి చేతివాటమో లేక మామూళ్ల వ్యవహారమో తెలియదు కానీ ఇక్కడ అన్ని నాసిరకం బ్రాండ్లు అమ్ముతున్నారు. కనీసం ఎప్పుడూ కనీ వినీ ఎరుగని చీప్ లిక్కర్ని పెద్ద బ్రాండ్లతో సమానంగా ధరలు పెట్టి అమ్ముతున్నారు. అందుకోసమే కొంతమంది పక్క రాష్ట్రాల వైపు చూస్తున్నారు, డబ్బులు పెట్టి ఆంధ్రాలో అమ్మే బ్రాండ్లను కొనుక్కోగలిగే స్తోమతవున్నా ఆ బ్రాండ్లు తాగితే మత్తు సంగతి దేముడెరుగు స్మశాన స్థలికి వెళ్లడం ఖాయమని చాలామంది మందుబాబులకు అర్థమైపోయింది.

తాము ధరలు పెంచో లేక బ్రాండ్లు తగ్గించో ప్రజలకి మేలు చేస్తున్నామని ప్రభుత్వం భావిస్తుంటే అది ముమ్మాటికీ భ్రమే. వాళ్ళు తీసుకున్న నిర్ణయం చాలామంది మందుబాబులు అనారోగ్యం పాలవుతుంటే, అవి తాగలేక బ్లాక్‌మార్కెట్ వైపు చూసేవారి కొంప గుల్లవుతోంది. మద్యం పాలసీ విషయంలో మధ్యవర్తుల మాటలు నమ్మకుండా ఇంటలిజెన్స్ వారి ద్వారా వాస్తవాలను తెలుసుకుని వీలయినంత త్వరగా వైసిపి ప్రభుత్వం ఆ ఊబినుండి బయటకు రావాలి. కొంతమంది అక్రమార్జన కోసం ఇటు ప్రజల ఆరోగ్యంతో ఆడుకోవడంతో పాటు అటు ప్రభుత్వానికి మచ్చ తెస్తున్నారని గమనించుకోవాలి.

కె.వి. కుమార్, నెల్లూరు.

# నగరమంతా పందులు, పాములు

నెల్లూరునగర శివార్లతో పాటు పట్టణ నడిబొడ్డులో కూడా ఇటీవల పాముల బెడద ఎక్కువైపోయింది. చాలా ప్రాంతాల్లో, కాలనీలలో ఇళ్ళ మధ్యలో ఉన్న ఖాళీ స్థలాలలో చేరిన మురుగు నీటి కారణంగా దోమలతో పాటు పందులు కూడా కాపురం చేస్తున్నాయి. ఈ స్థలాల్లోనే అడ్డగోలుగా పెరిగిన మొక్కలు చుట్టుపక్కల వాళ్ళు వేస్తున్న చెత్తాచెదారం కారణంతో పాములు కూడా కాపురం చేస్తున్నాయి. కార్పొరేషన్ అధికారులు పట్టించుకుని రక్షించాలని కోరుతున్నాను.

– ఆర్.వి. రామయ్య, కొండాయపాలెం.

## అడ్డగోలుగా ఆధార్.. మొబైల్ నెంబర్లు సేకరించడమే

# పెరుగుతున్న సైబర్ నేరాలకు, ఆన్‌లైన్ అప్పుల దందాలకు మూలమా?

'చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్టు' అన్న సామెతగా ఆధార్ కార్డు వ్యక్తిగత గోప్యతపై పెద్దకోర్టు తీర్పు చెప్పింది. ఆధార్‌ని కేవలం కొన్ని నిర్దిష్ట పథకాలకు.. ప్రభుత్వ శాఖలకే పరిమితం చేసింది. కేంద్రప్రభుత్వం మరో అడుగు ముందుకేసి ఆధార్‌ను ఎవరైనా దుర్విని యోగం చేస్తే కఠినమైన జరిమానాలు శిక్షలూ అంటూ చట్ట సవరణ కూడా చేసింది. అయినా ఇవేమీ పట్టనట్లు మాకన్ని టికీ ఆధారం ఆధారేనంటూ ప్రభుత్వ శాఖలు.. ప్రైవేటు సంస్థలు అడ్డగోలుగా ఆధార్ వివరాలు సేకరించడం.. పెద్దకోర్టు తీర్పుని, ప్రభుత్వ చట్టాన్నీ ఉల్లంఘించినట్లు కాదా...?




బ్యాంకు అకౌంటు ఓపెన్ చేయాలంటే ఇంకా ఆధార్ కావాలంటూ ఆధార్ లింక్ అయిన సాఫ్ట్‌వేర్‌లనే కొన సాగిస్తున్న బ్యాంకులు, ఆర్బీఐ సర్క్యులర్‌తో పాటు సుప్రీంకోర్టు తీర్పులను కూడా ఉల్లంఘించడం కాదా? ప్రభుత్వ సంస్థ లలో ప్రైవేటు సంస్థల జోక్యము జొరబాటే ఈ ఆధార్ వివరాల డేటా తస్కరణకు కారణం. సుప్రీం కోర్టు తీర్పులో కేవలం ప్రభుత్వ పథకాల లబ్ధిదారులకే ఆధార్‌ని పరిమితం చేసినా వాహన రిజిస్ట్రేషన్‌లకు.. స్థలం రిజిస్ట్రేషన్‌లకు ఆధార్ వివరాలు తప్పనిసరి అంటూ షరతులు పెట్టడం కోర్టు తీర్పు ఉల్లంఘన కాదా.

మొబైల్ నెంబర్లకు ఆధార్ లింకు అంటూ ఓ ప్రముఖ మొబైల్ నెట్‌వర్కు సంస్థ బ్యాంకు అకౌంట్లు వినియోగదారులకు తెలియకుండానే వారి నెంబర్లతో అకౌంట్లు ఓపెన్ చేసి, దాదాపు 140కోట్లు గ్యాస్ సబ్సిడీలను గుటకాయస్వాహ చేయడం నిజం కాదా.

ప్రజలు చైతన్యవంతులై ఆధార్ నెంబరుతో పాటు తమ మొబైల్ నంబర్లు కూడా ఎవరికి పడితే వారికి ఇవ్వడం మానుకోకపోతే ఈ సైబర్ నేరాలు మరింత పెరిగి, ఇంకా నష్టాలు తప్పవు. ఆధార్ దుర్వినియోగం చేసే సంస్థలపై చర్యలకు చట్టం సవరించారే కానీ అటువంటి కేసులు ఫైల్ చేసిన దాఖలాలు లేవు. సైబర్ క్రైం విభాగాలు పేరుకే ఉన్నాయి. వాటిలో సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకునేలా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలి. సైబర్ నేరగాళ్ళ గుండెల్లో దడపుట్టేలా శిక్షలు ఉండాలి. అడ్డగోలుగా ఆధార్, మొబైల్ నంబర్ల వివరాలు సేకరణను వ్యతిరేకించాలి. కంచే చేను మేసేలా అన్నట్లుగా వ్యవహరిస్తున్న ప్రభుత్వ శాఖలు ఆధార్ సేకరణ ఆపాలి. ఇది దేశప్రజల వ్యక్తిగత గోప్యతకు గౌరవానికి సంబంధించిన అంశం. సైబర్ నేర నివారణ కేంద్రాలు మాటల్లో కాకుండా చేతల్లో తమ సత్తా చూపాలి. ప్రజలు కూడా తమ మొబైల్ నెంబర్లూ ఆధార్ వివరాలు అడ్డగోలుగా ఇవ్వకుండా ఆధార్ పూర్తిగా మన వ్యక్తిగతం అన్న విషయాన్ని గుర్తుపెట్టుకోవాలి.

ఇట్లు,
జి.వి.నాగరాజారావు,
న్యాయవాది, హైకోర్టు.

**లాయర్**

పాఠకులకు మనవి
మా(మీ) లాయర్ పత్రికకు
**సమాచారం / లేఖలు**
పంపదలచిన వారు
**9866314741** నంబరుకు
వాట్సాప్ ద్వారా గాని, లేదా
lawyerpatrika@gmail.comకి
ఈ-మెయిల్ ద్వారా గాని
పంపవలసిందిగా విజ్ఞప్తి.
పోస్టల్ చిరునామా :
ఫ్లాట్ నెం. 1 & 2, మెయిన్‌రోడ్డు,
మాగుంట లే అవుట్, నెల్లూరు - 3.
- సం/-

# జన సేవోత్సవం.. జగన్ జన్మదినోత్సవం

- జగన్ పుట్టినరోజున.. ఉప్పొంగిన సేవా కెరటం
- రాష్ట్రవ్యాప్తంగా రక్తదాన శిబిరాలు
- రెండు తెలుగు రాష్ట్రాల బ్లడ్‌బ్యాంకుల్లో రక్తం కొరత తీర్చిన అభిమానులు

**పుట్టిన రోజు పండుగే అందరికీ..కానీ పుట్టింది ఎందుకో తెలిసేది ఎందరికి?.. అని ఒక సినీకవి అన్నట్లుగా పుట్టినరోజును పండుగ వేడుకగా కాక, సేవాభావపు వేదికగా మలుచుకున్నారు యువనేత జగన్ అభిమానులు. రాష్ట్ర వ్యాప్తంగా వైయస్సార్సీపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున కదిలివచ్చి ఎక్కడికక్కడ రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసుకుని రక్తదానాలు చేసి రక్తనిధుల్లో రక్తం నిల్వలకు కొరత లేకుండా చేశారు. సిఎం జన్మదినోత్సవం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ఎవరూ ఊహించని విధంగా రక్తదానాలు చేసి సిఎం పుట్టినరోజుకే కాక, తమ పుట్టుకకు కూడా సార్ధకత ఏర్పరచుకున్నారు.**

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పుట్టిన రోజైన డిసెంబరు 21న ఆయన అభిమానుల్లో సేవాకెరటం ఉప్పొంగింది. జగన్‌పై ఉన్న అభిమానం ఆయనకెంతో ఇష్టమైన ప్రజాసేవలో తరించింది. ప్రజలకు ఎప్పుడు ఏ ఆపద వచ్చినా ముందుండే వైకాపా నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు అందరూ ఏకమయ్యారు. సిఎం జగన్ పుట్టినరోజున కానుకగా ఏమివ్వాలని ఆలోచించి సమాజానికి ఉపయోగపడే కార్యక్రమం చేపట్టాలని నిర్ణయించుకున్నారు. సమాజానికి నేడు అత్యవసరమైనది.. అన్నిటికన్నా ముఖ్యమైనది రక్తదానం అనే సంగతి గుర్తొచ్చింది. అందులోనూ ఈ కరోనా కష్టకాలంలో ఆసుపత్రుల్లో బాధితులకు, రోగులకు అత్యవసరమైన రక్తం నిల్వల కొరతను గమనించారు. రక్తదానమంటే ప్రాణదానమే కనుక రక్తదానం వల్ల ఎంతో విపత్కర పరిస్థితుల్లో లేదా ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులు బాధితుల ప్రాణాలు నిలబెట్టేందుకు తమవంతు సేవగా..అదీ జగనన్నకు ప్రేమపూర్వకమైన కానుకగా రక్తదానం చేసి బాధితులను ఆదుకోవాలని సంకల్పించారు. మన రాష్ట్రంలోనే కాక తెలంగాణలో కూడా రక్తం కొరత తీవ్రంగా ఉందని, నిత్యం ఆసుపత్రుల్లో ఎందరో రోగులు, బాధితులు రక్తం దొరక్క విలవిలలాడుతున్నారని తెలుసుకున్నారు. రాష్ట్రాభివృద్ధికి అనునిత్యం పాటుపడుతున్న జగన్‌పై ఉన్న అభిమానంతో ఆయన పుట్టినరోజున అన్ని ప్రాంతాల్లో ఎవరికి వారు స్వచ్ఛంధంగా రక్తదానం చేయాలని అనుకున్నారు. అనుకున్నదే తడవుగా యువనేత జగన్ అభిమానులు, వైకాపా శ్రేణులు పెద్దఎత్తున రంగంలోకి దిగాయి. ఎంపీలు, ఎమ్మెల్యేలు అభిమానులు అంతా కలసి రక్తదానానికి చకచకా ఏర్పాట్లు చేసుకున్నారు. ఇక మనవాళ్లు తలచుకుంటే కానిదేముందీ?.. జగన్‌పై యువతలో అభిమానం పోటెత్తింది. రక్తం ఉప్పొంగింది. అంతే.. రక్తనిధులు ఒక్కసారిగా పొంగిపోయాయి. దీంతో మన రాష్ట్రంలోనే కాదు తెలంగాణలో కూడా బ్లడ్‌బ్యాంక్‌ల్లో రక్తనిధుల కొరత తీరిపోయింది. అంతేకాదు తమిళనాడు, ఒరిస్సా రాష్ట్రాలకు కూడా మన రాష్ట్రం నుంచి రక్తం సరఫరా చేసే స్థాయికి రావడం ఎంతైనా అద్భుతం..అమోఘం!.. గతంలో ఎంతటి గొప్ప నేతల పుట్టినరోజు పండుగలప్పుడు కూడా యువత నుంచి ఇంత పెద్దఎత్తున ఇంతటి సేవాభావం ఉరకలెత్తింది లేదు. ఒకే ఒక్కరోజున.. జగన్ పుట్టిన రోజున లక్షలాదిమంది రక్తదానాలు చేశారంటే ఆ దాతల మానవీయతకు హ్యాట్సాఫ్ చెప్పక తప్పదు. ఇంతటి సేవాభావం గతంలో ఎప్పుడూ ఏ సందర్భంలోనూ చూడలేదు. అది ఒక్క యువనేత జగన్‌పై ఉన్న అభిమానంతోనే సాధ్యమైందంటే అతిశయోక్తి కాదు.

## అందరికీ కృతజ్ఞతలు

**- ఆరోగ్యశాఖ కమిషనర్**

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పుట్టినరోజును పురస్కరించుకుని ఆయన అభిమానులు పెద్దఎత్తున రక్తదానం చేయడంతో రాష్ట్రంలోని అన్ని బ్లడ్‌బ్యాంకుల్లో రక్తనిల్వలు పుష్కలంగా ఉన్నాయని రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ కాటంనేని భాస్కర్ పేర్కొన్నారు. కరోనా వైరస్ నేపథ్యంలో అన్ని బ్లడ్‌బ్యాంకుల్లో రక్తనిల్వలు తగ్గిపోయాయాని ఆందోళన చెందుతున్న తరుణంలో ముఖ్యమంత్రి అభిమానులు ఆ కొరత తీర్చడం అభినందనీయమని అంటూ దాతలందరికీ ఆయన ఈ సందర్భంగా తన కృతజ్ఞతలు చెప్పారు.



రక్తదానం చేస్తున్న మంత్రి అనిల్

## జిల్లాలో 15వందల యూనిట్ల రక్తదానం

సిఎం పుట్టినరోజైన ఈనెల 21న జిల్లాలోని వైకాపా నాయకులు, ప్రజాప్రతినిధులు, అభిమానులు కలిసి రికార్డు స్థాయిలో రక్తదానశిబిరాలు ఏర్పాటుచేసి సుమారు 1500 యూనిట్లు రక్తదానం చేశారు. జిల్లాలోని 15 ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాలకు అభిమానులు రక్తదాతలుగా తరలివచ్చారు. నెల్లూరు పార్లమెంట్ సభ్యుడు ఆదాల ప్రభాకర్‌రెడ్డి, మంత్రి అనిల్‌కుమార్‌యాదవ్ నెల్లూరు రాజన్నభవన్‌లో తొలుత కేకు కట్‌చేసి సిఎంకు పుట్టినరోజు శుభాకాంక్షలు చెప్పుకుంటూ మెగా రక్తదాన శిబిరం ప్రారంభించారు. సిఎం పుట్టినరోజు సందర్భంగా ఆంధ్ర, తెలంగాణాల్లోనే కాకుండా ఎక్కడెక్కడ తెలుగువాళ్ళున్నారో వారంతా రక్తదాన శిబిరాలు ఏర్పాటుచేసి రక్తదానం చేయడం గర్వకారణమని మంత్రి అనిల్ అన్నారు. ఈ సేవా కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబుతో పాటు రెడ్‌క్రాస్ సంస్థ ఎంతగానో సహకరించడంతో రక్తదాన కార్యక్రమాలన్నీ అనుకున్నమేరకు సజావుగా జరిగాయి. నెల్లూరు నగరం, రూరల్ వైకాపా కార్యాలయాలతో సహా జిల్లాలోని ఆత్మకూరు, వెంకటగిరి, సంగం, చిల్లకూరు, వింజమూరు, దుత్తలూరు తదితర 15 ప్రాంతాల్లో మెగా రక్తదాన శిబిరాలు నిర్వహించి పెద్దసంఖ్యలో రక్తదానం చేయడం జిల్లాలోనే ఎంతో అరుదైన అపూర్వమైన విషయం.

### రెడ్‌క్రాస్ ప్రపంచ రికార్డు :

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఈనెల 21న ఒకే ఒక్కరోజులో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన రక్తదాన శిబిరాల ద్వారా దాతల నుంచి రక్తాన్ని సేకరించడంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సంస్థ ప్రపంచ రికార్డు సాధించిందని రెడ్‌క్రాస్ రాష్ట్ర శాఖ ఛైర్మెన్ డాక్టర్ ఎ.శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈనెల 22న ఆయన విజయవాడలో విలేకర్లతో ఈ విషయం చెప్పారు. రాష్ట్రంలో ఆ ఒక్కరోజులోనే 34,723మంది నుంచి 34,723యూనిట్ల రక్తాన్ని సేకరించడం గొప్ప విషయమన్నారు.



రక్తదాన శిబిరాన్ని పర్యవేక్షిస్తున్న మంత్రి అనిల్, ఎంపి ఆదాల ప్రభాకర్‌రెడ్డి తదితరులు



రక్తదానం చేస్తున్న కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి




సిఎం వైయస్ జగన్ బర్త్‌డే కేక్‌ను కట్ చేస్తున్న ఎన్‌డిసిసిబి ఛైర్మెన్ ఆనం విజయకుమార్‌రెడ్డి

# ఎమ్మెల్యే చెవిరెడ్డి ఔదార్యం

## - జగన్ పుట్టినరోజున 5.25 కోట్లతో దుస్తులు పంపిణీ



*దేశమంతా సంక్రాంతి పండుగ జనవరిలో వస్తే చిత్తూరుజిల్లా, చంద్రగిరి నియోజకవర్గంలో మాత్రం సంక్రాంతితో పాటు క్రిస్మస్, కొత్త సంవత్సర సంబరాలన్నీ ముందుగానే వచ్చేశాయన్నట్లుగా చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి తన ఔదార్యాన్ని ప్రదర్శించాడు. సిఎం జగన్ పుట్టినరోజును పురస్కరించుకుని జగన్‌పై, వైఎస్ కుటుంబంపై తనకున్న ప్రత్యేక అభిమానాన్ని చాటుకుంటూ సేవాభావంతో ఈ కార్యక్రమం నిర్వహించి అందరి ప్రశంసలు అందుకుంటున్నాడు.*

ముఖ్యమంత్రి జగన్ పుట్టినరోజును పురస్కరించుకుని ఎంతో మంది రక్తదానాలు చేస్తుంటే ప్రభుత్వ విప్, తుడా ఛైర్మెన్, చంద్రగిరి ఎమ్మెల్యేగా ఉన్న చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కోట్లాది రూపాయల విలువైన దుస్తులను ప్రజలకు కానుకగా పంపిణీచేసి తన ఔదార్యాన్ని చాటుకున్నాడు. తన నియోజకవర్గమైన చిత్తూరు జిల్లా చంద్రగిరిలో దాదాపు పాతికవేల మందికి 5.25కోట్ల రూపాయల విలువైన దుస్తులను వితరణగా అందించాడు. చంద్రగిరి నియోజకవర్గంలో పారిశుద్ధ్య కార్మికుడి దగ్గర నుంచి ఉన్నతాధికారుల దాకా పలు హోదాల్లో పనిచేసే 9వేల మంది ప్రభుత్వ ఉద్యోగులకు, వైఎస్సార్సీపి శ్రేణులకు, పార్టీకి అండగా పనిచేస్తున్న కార్యకర్తలు తదితరులు మరో 16 వేల మందికి వీటిని అందజేసి వైఎస్ కుటుంబంపై తనకున్న అభిమానాన్ని చాటు కున్నాడు. వైఎస్ కుటుంబీకుల మానవీయ స్ఫూర్తితో ఈ కార్యక్రమం చేపట్టినట్లు ఆయన చెప్పాడు. నాణ్యమైన దుస్తులతో పాటు, గ్రీటింగ్ కార్డు, శ్రీవారి ప్రసాదం, క్యాలెండర్, స్వీట్‌బాక్సు, బ్యాగు అందరికీ అందజేసి.. దటీజ్ చెవిరెడ్డి అనిపించుకున్నాడు.




# నెల్లూరులో 15వేల మందికి ఇళ్ళస్థలాలు

## మంత్రి డాక్టర్ అనిల్

నెల్లూరు నగర నియోజకవర్గంలో దాదాపు 15వేల మందికి ఇళ్ళ స్థలాలు ఇచ్చేందుకు ఎంపికచేయడం జరిగిందని, వాటిలో మొదటి విడతగా 7800 మందికి ఇళ్ళు కట్టిస్తామని రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి డాక్టర్ అనిల్‌కుమార్‌యాదవ్ చెప్పారు. ఈనెల 22న ఆయన నెల్లూరులోని 10వ డివిజన్‌లో ప్రజలను కలిసి మాట్లాడుతూ నెల్లూరు నగరంలోని పేదలందరికీ ఆరంకణాల స్థలంతోపాటు ఇంటిని కూడా కట్టించి ఇస్తామన్నారు. రెండవ విడతలో మరో 14 వేల మందికి ఇళ్ళ స్థలాలిస్తా మన్నారు. రాష్ట్రంలో ఈనెల 25న లక్షలాదిమంది పేదలకు ఇళ్ళస్థలాలిచ్చే కార్యక్రమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి శ్రీకారం చుడుతు న్నారని, స్థలాలిచ్చి ఇళ్ళు కట్టించి పేదల సొంతింటి కల సాకారానికి ముఖ్యమంత్రి జగన్ కృషిచేస్తుంటే దానిని అడ్డుకునేందుకు కొంతమంది కోర్టులకు వెళ్ళడం దారుణమన్నారు. టిడిపి పాలనలో కేవలం నాలుగంక ణాలు మాత్రమే కేటాయించి అపార్ట్‌మెంట్లు కట్టారని, తమ ప్రభుత్వం ఆరు అంకణాలు ఇస్తున్నా తమపై టిడిపి వారు లేనిపోని విమర్శలు చేయడం సిగ్గుచేటని ఆయన దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు ముక్కాల ద్వారకానాథ్, కొండా శివారెడ్డి, ఉప్పాల శేషగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్‌శాఖకు కొత్త ఎస్ఇగా ఆదిశేషయ్య



ఏపిఎస్‌పిడిసిఎల్ నెల్లూరు జిల్లా సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్‌గా కొండా ఆదిశేషయ్య ఈనెల 24వ తేదీ గురువారం ఉదయం నెల్లూరులోని విద్యుత్ భవన్‌లో బాధ్యతలు చేపట్టాడు. ఈ సందర్భంగా స్థానిక విద్యుత్ అధికారులు ఆయనను అభినం దిస్తూ శుభాకాంక్షలు తెలియ జేశారు. తిరుపతిలోని కార్పొరేట్ కార్యాల యంలో జనరల్ మేనేజర్(ఎల్ఎంసి)గా విధులు నిర్వహిస్తున్న ఆదిశేషయ్య స్వస్థలం జిల్లాలోని గూడూరు మండలం చెన్నూరు గ్రామం. తొలినుంచి ఆయన ఎంతో నిబద్ధతతో విధులు నిర్వహించేవాడు. అంచె లంచెలుగా ఎదుగుతూ విద్యుత్ శాఖలో పలు బాధ్యతలను నిర్వహించాడు. విద్యుత్ ఏ.ఇగా మైపాడులోనూ, ఏడిఇగా కావలిలోనూ, డిప్యూటి ఇంజ నీర్‌గా నాయుడుపేట, గూడూరు ప్రాంతాల్లోనూ ఆయన క్రమశిక్షణతో పనిచేసి మంచిపేరు తెచ్చుకున్నారు. విద్యుత్‌శాఖ ఎస్ఇగా కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఆదిశేషయ్యకు 'లాయర్' శుభాకాంక్షలు.



ఆదిశేషయ్యకు శుభాకాంక్షలు తెలుపుతున్న విద్యుత్‌శాఖ ఏ.ఇ.లు, డి.ఇ.లు

# 'అమ్మ ఒడి'కి.. 3.71 లక్షల మంది విద్యార్థులు

జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు, ప్రైవేట్ స్కూళ్ళు, కళాశాలల్లో చదువుకుంటున్న 3లక్షల 71వేల 65 మంది విద్యార్థులు ప్రభుత్వం అమలుచేస్తున్న 'అమ్మ ఒడి' పథకానికి ఎంపికైనట్లు డిఇఓ తెలిపారు. ఇంకా దాదాపు 6వేల మంది దాకా విద్యార్థులు సరైన పత్రాలు ఇవ్వాల్సి ఉంది కనుక వారి విషయం పెండింగ్‌లో ఉందని చెప్పారు. ఈ పథకానికి మొత్తం 4,32,834 మంది దరఖాస్తు చేసుకున్నారని, అర్హులైన ప్రతిఒక్కరికీ అమ్మఒడి పథకం వర్తింపజేస్తామని, అర్హులను గుర్తించి తుది జాబితాను త్వరలో విడుదల చేస్తామని ఆయన పేర్కొన్నారు.

# నెల్లూరు కబుర్లు

## పెద్దాసుపత్రిలో

# సాధారణ వైద్యసేవలు

## కరోనా బాధితులకు ప్రత్యేకవార్డులో చికిత్సలు

నెల్లూరు పెద్దాసుపత్రిలో ఇటీవల సాధారణ వైద్యసేవలు కూడా ప్రారంభమయ్యాయి. కరోనా ప్రబలుతున్న పరిస్థితుల్లో గత జూన్‌లో ఈ ఆసుపత్రిని రాష్ట్ర కోవిడ్ ఆసుపత్రిగా మార్చడంతో ఇక్కడ సాధారణ రోగులకు చికిత్సలు నిలుపుదల చేశారు. దీంతో సాధారణ రోగులు అనేక ఇబ్బందులు పడ్డారు. నారాయణ ఆసుపత్రిలో సాధారణ వైద్యసేవ లందించేలా ఏర్పాట్లుచేసినా పెద్దాసుపత్రికి వచ్చే రోగుల సంఖ్య తగ్గకపోవ డంతో ప్రభుత్వం ఈ పెద్దాసుపత్రిని రాష్ట్ర కోవిడ్ ఆసుపత్రుల జాబితా నుంచి తొలగించి సాధారణ రోగులకు కూడా చికిత్సలు అందేలా చేసింది. కరోనా బాధితులకు మాత్రం ప్రత్యేకవార్డులో వైద్యసేవలందిస్తున్నారు.

## విశ్వవిఖ్యాత గణిత మేధావి..

# శ్రీనివాస రామానుజన్

- విపిఆర్ ఫౌండేషన్ సిఇఓ నారాయణరెడ్డి



నెల్లూరు సమీపంలోని కనుపర్తిపాడు వద్ద ఉన్న 'విపిఆర్ విద్య'లో జాతీయ గణిత దినోత్సవం ఘనంగా జరిగింది. విపిఆర్ విద్య పాఠశాల, జూనియర్ కళాశాలల్లో జాతీయ గణిత దినోత్సవ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా విపిఆర్ ఫౌండేషన్ సిఇఓ ప్రొఫెసర్ వి. నారాయణరెడ్డి మాట్లాడుతూ విశ్వవిఖ్యాత గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ అద్వితీయ ప్రతిభా పాటవాలను విద్యార్థులకు వివరిం చారు. పేద కుటుంబంలో పుట్టినా స్వయంకృషితో ఎదిగి గణితశాస్త్రంలో అపారమైన ప్రజ్ఞాపాటవాలతో ప్రపంచ ప్రఖ్యాత గణితశాస్త్రవేత్తగా పేరొంది భారతదేశ కీర్తిని విశ్వవ్యాప్తం చేసిన గొప్ప వ్యక్తి శ్రీనివాస రామానుజన్ అని కొనియాడారు. దేశం గర్వించదగిన ఆ మహనీయుడిని ఆదర్శంగా తీసుకుని విద్యార్థులందరూ ప్రతిభతో రాణించాలన్నారు. ప్రిన్సిపాల్ వి.టి శ్రీనివాసులు మాట్లాడుతూ విద్యార్థులకు రామానుజం థియరీని వివరించారు. తొలుత గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విపిఆర్ విద్య పాఠశాల అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఉచితంగా కంటి పరీక్షలు

నెల్లూరు సమీపంలో ఉన్న ఆమంచర్ల సేవాజ్యోతి లెప్రసీ కాలనీలో ఈనెల 22న జిల్లా అంధత్వ నివారణ అధికారి డాక్టర మంజులమ్మ 65 మందికి కంటి పరీక్షలు చేసి ఉచితంగా కళ్ళద్దాలు ఇచ్చారు. వీరిలో నలుగురికి ఆపరేషన్లు అవసరమని గుర్తించి వారిని నెల్లూరులోని మోడరన్ ఆసుపత్రికి పంపించారు. డిఎం అండ్‌హెచ్ఓ ఆధ్వర్యంలో ఈ ఉచిత నేత్ర వైద్య శిబిరం జరిగింది.

# తల్లీబిడ్డలను సంరక్షించుకోవాలి

జిల్లాలో మాతా శిశుమరణాలు జరగకుండా ప్రతిఒక్కరూ కృషి చేయాలని డిఎంఅండ్‌హెచ్ఓ రాజ్యలక్ష్మి అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. ఈనెల 22న నెల్లూరులోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడుతూ తల్లీబిడ్డలను సంరక్షించు కోవడమే ధ్యేయంగా అందరూ పనిచేయాలన్నారు. ఇటీవల దగదర్తి మండలం తురిమెర్ల పిహెచ్‌సిలో జరిగిన మాతృమరణాలను ఆమె ప్రస్తావిస్తూ సమస్యలను తెలుసుకున్నారు. విపత్కర్థితిలో ఉన్న గర్భవతులకు మెరుగైన చికిత్సలందించేందుకు జిజిహెచ్‌కు సిఫార్సు చేయాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో డిఐఓ శైలినాకుమారి, పిఓడిటిటి ఉమా మహేశ్వరి, సర్వైలెన్స్ అధికారి అమరేంద్రనాథ్‌రెడ్డి, జిజిహెచ్ వైద్యులు ప్రభాకర్, విజయకుమార్, భాస్కర్, మీనాకుమారి తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి భరోసా

## 4.12 లక్షలు సాయం అందజేసిన హోంగార్డులు



ఇన్నాళ్ళూ తమలో ఒకరిగా ఉంటూ అనారోగ్యంతోనో లేదా ఇతరత్రా కారణాల వల్లనో మరణించిన వారి కుటుంబాలను ఆదుకునేందుకు హోంగార్డులు కలిసికట్టుగా చేస్తున్న సాయం బాధిత కుటుంబాన్ని ఎంతగానో ఆదుకుంటోంది. నెల్లూరు హోంగార్డుల విభాగంలో పనిచేస్తున్న ఆర్‌ఎస్ లక్ష్మణ్ అనే హోంగార్డు ఇటీవల అనారోగ్యంతో చనిపోవడంతో జిల్లాలోని హోంగార్డులందరూ తమ ఒకరోజు వేతనాన్ని ఆ కుటుంబానికి అందించి తమ మానవత్వాన్ని చాటుకున్నారు. మొత్తం 4 లక్షల 12వేల 510 రూపాయలను చెక్కు రూపంలో జిల్లా ఎస్పీ భాస్కర్‌భూషణ్ చేతులమీదుగా అందించారు. మృతుని కుమార్తె ఆర్ఎస్ భవానికి ఆ చెక్కును అందజేసి బాధితురాలి కుటుంబానికి తామంతా అండగా ఉం టామని భరోసా ఇచ్చారు. ఈనెల 22న జిల్లా పోలీస్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఏఎస్పీ వెంకటరత్నం, హోంగార్డ్స్ ఆర్ఐ వై.ఫాల్‌రాజు, ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## కానిస్టేబుల్ కుటుంబానికి సాయం :

నెల్లూరు దర్గామిట్ట పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న చలపతి ఈ ఏడాది సెప్టెంబర్‌లో అనారోగ్యంతో మృతిచెందడంతో ఆయన కుటుంబానికి భద్రతా ఎక్స్‌గ్రేషియా కింద మంజూరైన 3,97,060 రూపాయల చెక్కును జిల్లా ఎస్పీ భాస్కర్‌భూషణ్ ఈనెల 22న మృతుని భార్య మలార్‌కు అందజేశారు.

# డిగ్రీ సెమిస్టర్‌లో బిజిఆర్ విద్యార్థినుల ప్రతిభ



విక్రమసింహపురి యూనివర్శిటీ తాజాగా విడుదల చేసిన డిగ్రీ రెండవ, నాల్గవ సెమిస్టర్ ఫలితాల్లో నెల్లూరులోని బెజవాడ గోపాలరెడ్డి మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు తమ సత్తాచాటుతూ ఉత్తమ ఫలితాలు సాధించారు. వారిని అధ్యాపకులు ఈనెల 23న కళాశాలలో ఏర్పాటుచేసిన సభలో అధ్యాపకులు అభినందించారు. కళాశాల సెక్రటరీ మరియు కరెస్పాండెంట్ దొడ్ల శేషారెడ్డి, ఏ.ఓ నరేష్, ప్రిన్సిపాల్ శ్రీమతి మృదుల తదితరులు పాల్గొన్నారు.

# 'జయభారత్'కి లక్షా పాతిక వేల విరాళం

నెల్లూరులోని జయభారత్ ఆసుపత్రికి ఈనెల23న విశ్రాంత వ్యవ సాయ అధికారి చిత్తలూరు సీతారామిరెడ్డి జ్ఞాపకార్థం ఆయన సతీమణి ప్రమీలమ్మ మాగుంట లేఅవుట్‌లోని తన నివాసంలో జయభారత్ ఆసు పత్రి ట్రస్టీ డాక్టర్ సుబ్రహ్మణ్యంకు లక్ష రూపాయల చెక్కును అందజేశారు. అదేవిధంగా నెల్లూరుకు చెందిన ఇసనాక ఆనందమోహన్‌రెడ్డి పాతిక వేల రూపాయలను విరాళంగా అందించారు.

# టిడిపి ఆఫీసులో..క్రిస్మస్ వేడుకలు

నెల్లూరులోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఈనెల 22న టిడిపి జిల్లా క్రిస్టియన్ సెల్ అధ్యక్షుడు సురేంద్రబాబు ఆధ్వర్యంలో ముందస్తు క్రిస్మస్ వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమంలో పాల్గొన్న టిడిపి నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ అన్ని మతాల సారం మానవత్వమేనని అంటూ ప్రపంచంలోని అనేకదేశాల్లో ప్రజలు క్రిస్మస్‌ను ఎంతో వేడుకగా జరుపుకుంటారని అన్నారు. తొలుత ఫాదర్ జోసఫ్ ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. టిడిపి నాయకులు ఆనం వెంకటరమణారెడ్డి, చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, తిరుమలనాయుడు, పనబాక భూలక్ష్మి, ధర్మవరపు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా నెల్లూరు ఏఎంసి కార్యాలయంలో ఛైర్మన్ ఏసునాయుడు ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి.

● ఎన్నాళ్ళకెన్నాళ్ళకు...

# ఆదాల రాకతో సందడే సందడి

**నెల్లూరు ఎంపి, వైయస్సార్సీపి నాయకుడు ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఈనెల 20న నెల్లూరుకు రావడంతో జిల్లాలోని పార్టీ వర్గాల్లో, ఆయన అభిమానుల్లో సంతోషం వెల్లువెత్తింది. తొలి నుంచి సేవాభావంతో ఉండే నేతగా, ప్రజా సేవా తత్పరునిగా అందరి ప్రశంసలందుకుంటున్న ఆదాల రాగానే ఆత్మీయులు, ఆయన సహచరుల్లో ఆనందోత్సాహాలు పెల్లుబుకాయి. ఈనెల 21 రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పుట్టిన రోజును పురస్కరించుకుని అభిమానులు, నాయకులు నిర్వహించిన రక్తదాన శిబిరాల్లోను, కోవూరులో ఎమ్మెల్యే ప్రసన్నరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లోను ఆదాల పాల్గొని అందరినీ పేరుపేరునా పలకరించారు. జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబును కూడా కలిసి ఆయనకు శుభాకాంక్షలు చెప్పారు.**



నెల్లూరు పార్లమెంట్ సభ్యుడు ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఈనెల 20న నెల్లూరుకు వచ్చారు. కోవూరుకు వెళ్ళి ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డితో కలిసి నందులగుంటలో వాటర్‌ప్లాంట్‌కు ప్రారంభోత్సవం చేశారు. జిల్లాలో నీటిపారుదల రంగానికి సంబంధించి దాదాపు మూడు వేల కోట్ల రూపాయలతో అభివృద్ధిపనులు జరుగుతున్నాయని, ఇంతటి అభివృద్ధిని తన రాజకీయ జీవితంలో తాను చూడలేదని ఆదాల సంతోషం వ్యక్తం చేశారు. ఒక్క కోవూరు నియోజకవర్గంలోనే సుమారు 300 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతుండడం విశేషమన్నారు. ఆ తర్వాత కోవూరు మండలంలోని వేగూరు పంచాయతీలో 18 లక్షలతో నిర్మించనున్న సిమెంట్ రోడ్లకు శంకుస్థాపన చేశారు. పడుగుపాడులో 35 లక్షల ఎంపి నిధులతో వాటర్‌ప్లాంట్‌లకు ప్రారంభోత్సవం చేశారు. ఆ తర్వాత గుమ్మళ్ళదిబ్బలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ కోవూరు నియోజకవర్గం ప్రజలు ఎంతో చైతన్యవంతులని, దివంగత నేత నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి హయాం నుంచే ఈ నియోజకవర్గం బాగా అభివృద్ధి చెందిందని చెప్పారు. ఇప్పుడు ప్రసన్న హయాంలో కోవూరు నియోజకవర్గం మరింతగా అభివృద్ధి చెందాలంటూ ఎమ్మెల్యేను ఆశీర్వదించారు. వైయస్సార్సీపి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి జగన్ సారథ్యంలో రాష్ట్రంలో ఎన్నో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు జరుగుతున్నాయని, రాష్ట్రం ఒకవైపు ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా అభివృద్ధి పనులు చేయడంలో ప్రభుత్వం రాజీ పడడం లేదని కొనియాడారు. ఈ సందర్భంగా పలుప్రాంతాల్లో ప్రజలు నాయకులు కార్యకర్తలు ఆదాలకు ఘనస్వాగతం పలికారు.

**రక్తదానం.. ప్రాణదానంతో సమానం :**

నెల్లూరులోని రాజన్నభవన్‌లో నిర్వహించిన సిఎం జగన్ పుట్టినరోజు వేడుకల్లో ఆదాల పాల్గొన్నారు. జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ పి.అనిల్‌కుమార్ యాదవ్‌తో కలసి కేకు కట్ చేసి అందరికీ పంచారు. ఆ తర్వాత పెద్దఎత్తున జరిగిన మెగా రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో ఆదాల మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమని, ఎంతోమంది రోగులకు, బాధితులకు అవసరమైన రక్తాన్ని సేకరించి బ్లడ్ బ్యాంకులకు అందివ్వడం అభినందనీయమని ఆయన రక్తదాతలను కొనియాడారు. రాష్ట్ర అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు అందరూ అండగా నిలవాలని పిలుపునిచ్చారు. రాబోయే 30 ఏళ్ళు జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండాలని ప్రజలు ఆశీర్వదించాలని కోరారు.

**కలెక్టర్‌ను కలిసిన ఆదాల :**

జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబును ఎంపి ఆదాల ఈనెల 21న మర్యాదపూర్వకంగా కలిసి జిల్లాలో అమలవుతున్న సంక్షేమ కార్యక్రమాలపై కొద్దిసేపు చర్చించారు. జిల్లాలో ఇటీవల నివర్ తుఫాన్ వల్ల జరిగిన నష్టం, ప్రభుత్వ సాయం తదితర విషయాలపై కలెక్టర్‌తో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపి వెంట విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి తదితరులున్నారు.

### విజయ డెయిరీ క్యాలెండర్ ఆవిష్కరణ



ఈనెల 22న నెల్లూరు ఎంపి ఆదాల ప్రభాకర్‌రెడ్డి విజయ డెయిరీ కొత్త క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. నెల్లూరులోని తన నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆదాలతో పాటు డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, మాజీ కార్పొరేటర్ స్వర్ణా వెంకయ్య, కోటేశ్వరరెడ్డి, మల్లు సుధాకర్‌రెడ్డి, అబూబకర్, నరసింహారావు, అల్లాభక్షు, మధు తదితరులు పాల్గొన్నారు.

# ఆదాలకు అ'ద్వితీయ' గౌరవం

- ➢ కరోనా కష్టకాలంలో విశిష్టసేవలు
- ➢ దేశంలోనే నెంబర్ టూగా నిలచిన సేవామూర్తి



**తొలి నుంచి మంచి సేవాభావం, మానవీయత కలగలసిన నేతగా ప్రజలందరి అభిమానం పొందిన దాతగా ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఇప్పుడు తాజాగా దేశవ్యాప్త గౌరవం అందుకున్నాడు. వదాన్యతలో, ప్రజా సేవలో అందులోనూ కరోనా కష్టకాలంలో ప్రజలకు, బాధితులకు సేవలందించడంతో తనకు తనే సాటి అని నిరూపించుకున్నాడు. తద్వారా నెల్లూరీ యునిగా నెల్లూరుకు దేశవ్యాప్త ఖ్యాతిని సాధిం చాడు. కష్టాల్లో ఉన్న ప్రజలను ఆదుకునే సేవామూర్తిగా, సొంతనిధులను సైతం ప్రజల కోసం వెచ్చించే వదాన్యునిగా ఆదాల ప్రజల ఆత్మీయాభిమానంతో పాటు ప్రశంసలు అందుకుంటున్నాడు.**

నెల్లూరు పార్లమెంట్ సభ్యుడు, వైయస్సార్సీపి నాయకుడు, ప్రముఖ వదాన్యుడు ఆదాల ప్రభాకర్‌రెడ్డికి దేశంలోనే ఎంతో అరుదైన అపురూపమైన గౌరవం లభించింది. కరోనా కష్టకాలంలో ఎంపిల్యాడ్స్‌తో పాటు తన సొంత నిధులను కేటాయించడంలో, పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో కరోనా తీవ్రతపై స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో నిరంతరం సమీక్షించి ప్రజలకు విశిష్ట సేవలందించడంలో దేశంలోనే ఆదాల నెంబర్ టూగా నిలిచారు. ఢిల్లీకేంద్రంగా పనిచేసే గవర్న్ ఐ అనే సంస్థ దేశవ్యాప్తంగా కరోనా సమయంలో సేవలందించిన పార్లమెంట్ సభ్యుల పనితీరు గురించి ఆరునెలల పాటు సర్వే చేసి, 25 పార్లమెంట్ స్థానాల పరిధిలోని 34.23 లక్షలమంది ప్రజల అభిప్రాయాలను సర్వే ఏజెన్సీల ద్వారా సేకరించగా కరోనా సమయంలో విస్తృతమైన సేవలందించిన లోక్‌సభ ఎంపీల జబితాలో దేశంలోనే నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి ద్వితీయ స్థానంలో నిలచి అందరి ప్రశంసలందుకున్నారు. ఈ జాబితాలో మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయిని ఎంపీ అనిల్ ఫిరోజియా ప్రథమ స్థానంలో నిలవగా, వయనాడ్ నుంచి కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ తృతీయస్థానంలో ఉన్నారని సర్వే పేర్కొంది. కరోనా విజృంభిస్తున్న తరుణంలో ఎంపీ నిధులతో పాటు తన సొంతనిధులను 20 లక్షల రూపాయలను అప్పటి కలెక్టర్ శేషగిరిబాబుకు అందజేసిన దాతృత్వం ఆదాలది. ఇప్పుడే కాదు గతంలో కూడా ఆదాల ట్రస్ట్ ఆధ్వర్యంలో జిల్లాలోనూ, రాష్ట్రంలోనూ అనేక సేవా కార్యక్రమాలు చేపట్టారు. మంచితనం మానవత్వం సేవాభావం ఆయన సుగుణాలు. అవే ఆయనకు ఇంత ఖ్యాతిని తెస్తున్నాయి. దేశంలో దానధొరేయులు ఎంతోమంది ఉన్నా దాతృ త్వంలో.. సేవాభావంలో దేశంలోనే టాప్ టెన్‌లో మన ఆదాల నెంబర్ టూగా నిలవడం మనందరికే కాదు.. సింహపురి సీమకే గర్వకారణం.

● భూ సమస్యలు తీర్చేందుకు..

# సిఎం నిర్ణయం సాహసోపేతం

**- జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు**



భూముల సమస్యలు తీర్చేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తీసుకున్న భూముల రీ-సర్వే నిర్ణయం ఎంతో సాహసోపేతమైనదని, అధికారులు ఎలాంటి వత్తిళ్ళకు ప్రలోభాలకు లోను కాకుండా ఈ ఈ ప్రక్రియను పారదర్శకంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు చెప్పారు. ఈనెల 22న ఆయన గూడూరు మండలంలోని కొమ్మనేటూరు పంచాయతీ రెడ్డిగుంట గ్రామంలో వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు-భూరక్ష పథకాన్ని ప్రారంభించి మాట్లాడుతూ జిల్లాలో మూడు దశల్లో 1200 గ్రామాల్లో ఉన్న భూములను సర్వే చేస్తామని, రైతులు సహకరించాలని కోరారు. రెవెన్యూ, సచివాలయ సిబ్బందితో కలసి భూమిని రీ-సర్వే చేసి భూ యజమానికి సంపూర్ణ హక్కు ఇవ్వాలన్నదే సిఎం లక్ష్యమని అంటూ, ఈ ప్రక్రియ ద్వారా అర్హులైన వారందరికీ న్యాయం జరుగుతుందని, అందరూ ఇందుకు సహకరించాలని కోరారు. తొలుత ఆయన డ్రోన్‌ను ప్రారంభించి భూరక్ష సర్వే రాయిని నాటారు. జేసీలు ప్రభాకర్‌రెడ్డి, హరేందిరప్రసాద్, గూడూరు సబ్ కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణ, తహశీల్దార్ లీలారాణి, మునిసిపల్ కమిషనర్ ఓబులేసు, సర్వేయర్ ఏ.డి హనుమప్రసాద్, డిసిఎంఎస్ ఛైర్మెన్ వీరిచలపతి, ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, మల్లు విజయకుమార్‌రెడ్డి, రమేష్‌బాబురెడ్డి పాల్గొన్నారు.

● శ్రీసిటీ ఫౌండేషన్ వితరణ



# ప్రభుత్వ బడులకు లైబ్రరీ పుస్తకాలు

ప్రఖ్యాత పారిశ్రామిక నగరంగా పేరొందిన శ్రీసిటీ పరిశ్రమల రంగంలో నిరంతర చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలతో పాటు శ్రీసిటీ పరిసరాల్లోని విద్యార్థులకు కూడా తనవంతు సేవలందిస్తూ తన ప్రత్యేకతను చాటుకుంటోంది. శ్రీసిటీ ఫౌండేషన్ పేరుతో గత ఎనిమిదేళ్ళుగా శ్రీసిటీ చుట్టుపక్కల ఉన్న అనేక ప్రభుత్వ బడుల అభివృద్ధికి తనవంతుగా ఎంతో చేయూతనందిస్తోంది కూడా. తాజాగా ఈనెల 22న శ్రీసిటీ పరిధిలోని 7 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలకు, ఒక ప్రాథమికోన్నత పాఠశాలకు సుమారు రెండున్నర లక్షల రూపాయల విలువజేసే పుస్తకాలను పంపిణీ చేయడం విశేషం. శ్రీసిటీ పరిధిలోని చెరివి, ఇరుగుళం, మాదనపాళెం, అరూరు, గొల్లవారిపాళెం, మల్లవారిపాలెం ఈస్ట్, చెంగంబాకం, రామచంద్రాపురం గ్రామాల్లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ఉన్న లైబ్రరీల్లో విద్యార్థులకు అందుబాటులో ఉండేలా 138 రకాల పుస్తకాల సెట్‌లను హెడ్మాస్టర్లకు అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీసిటీ ఫౌండేషన్ ప్రెసిడెంట్ రమేష్ సుబ్రహ్మణ్యం, శ్రీసిటీ సెజ్ డెవలప్‌మెంట్ కమిషనర్ ఆర్.ముత్తురాజ్ తదితరులు పాల్గొన్నారు. త్వరలో ఐఓఎంపి (మిత్సుబిషి) కంపెనీ వారి సహకారంతో మత్తేరిమిట్ట పంచాయతీలోని పాఠశాలలకు కూడా లైబ్రరీ పుస్తకాలు పంపిణీ చేసేందుకు కృషిచేస్తున్నామని వారు చెప్పారు.

## గూడూరు డివిజన్ వార్తలు

### ఘనంగా సిఎం జగన్
# జన్మదిన వేడుకలు



ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 21వ తేదీ టవర్‌క్లాక్ కూడలి వద్ద అభిమానులు, పార్టీ కార్యకర్తల సమక్షంలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేసి భారీకేక్ కట్ చేశారు. వైయస్సార్‌సీపీ కేంద్ర సిఇసి సభ్యులు యల్లసిరి గోపాల్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేయడంలో తండ్రికి తగ్గ తనయుడిగా జగన్మోహన్‌రెడ్డి పేరు తెచ్చుకొన్నాడని, ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయాడని కొనియాడాడు. వైయస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మల్లు విజయకుమార్‌రెడ్డి, పట్టణ అధ్యక్షులు బొమ్మిడి శ్రీనివాసులు, వైయస్సార్‌సీపీ నాయకులు కోడూరు మీరారెడ్డి, బాబురెడ్డి, వైయస్ జగన్మోహన్‌రెడ్డికి 48వ జన్మదిన శుభాకాంక్షలు తెలిపి మాట్లాడారు. కోడూరు కల్పలత, సతీష్‌రెడ్డి, గిరిబాబు, గఫూర్, ముగ్దామ్, తాళ్ళూరు శ్రీనివాసులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు, భారీసంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.



## పేర్నాటి మెగా రక్తదాన శిబిరం

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి 48వ పుట్టిన రోజును పురస్కరించుకుని ఈ నెల 21వ తేదీ వైకాపా రాష్ట్ర కార్యదర్శి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి కోట మండలం, కొత్తపట్నం పంచాయతీలో కనీవినీ ఎరుగని రీతిలో భారీ రక్తదాన శిబిరం ఏర్పాటు చేశాడు. ఈ రక్తదాన శిబిరం ద్వారా సుమారు 350 యూనిట్ల రక్తం సేకరించి రెడ్‌క్రాస్ వారికి అందించారు. ఈ కార్యక్రమంలో సాయికృష్ణారెడ్డి, రాధారెడ్డి, ప్రసాద్‌గౌడ్, ప్రభాకర్‌గౌడ్, కిషోర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



### దుర్గంధ భరితం..
## మున్సిపల్ డంపింగ్ యార్డ్

గూడూరు చల్లకాలువ ప్రక్కన ఉన్న డంపింగ్‌యార్డ్‌లో ఇటీవల కురిసిన వర్షాలకు చెత్తనుండి దుర్వాసన వెదజల్లుతోందని, దీనివల్ల అంటురోగాలు ప్రబలే అవకాశం ఉందని, మున్సిపల్ సిబ్బంది, అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో గూడూరు పట్టణం నుంచి సేకరించిన చెత్తను డంపింగ్‌యార్డు ముందు భాగంలో వేయడంతో వర్షాలకు కుళ్ళి దుర్గంధమైన వాసన వస్తోందని ప్రజలు వాపోతున్నారు. ఇకనైనా మున్సిపల్ అధికారులు స్పందించి చెత్తను డంపింగ్‌యార్డు వెనక ఉన్న కొత్త డంపింగ్ యార్డులో దూరంగా వేసే విధంగా సిబ్బందికి సూచనలను చేసి ప్రజల ఆరోగ్యాలను కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# వృద్ధురాలికి ఇల్లు కట్టిస్తున్న కనుమూరు



కోటీశ్వరులు ఎందరో ఉంటారు, కానీ ఖర్చు చేయగల స్వభావం కొందరికే ఉంటుందని, అలాంటి స్వభావం కలిగిన వారిలో వైకాపా నేత కనుమూరి హరిచంద్రారెడ్డి ముందు వరుసలో నిలుస్తారని గూడూరు రూరల్ పోలీస్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ శ్రీనివాసరెడ్డి అన్నాడు. అనేక ప్రయోజనకర కార్యక్రమాలు చేపట్టిన కనుమూరి హరిచంద్రారెడ్డి, సీఎం జగన్ జన్మదినం రోజు ఓ వృద్ధురాలికి ఇల్లు నిర్మించేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నాడు.

వివరాల్లోకి వెళితే.. గూడూరు గాంధీనగర్‌లోని దండోరా కాలనీలో నివర్ తుఫాన్ సమయంలో ఓ వృద్ధురాలు ఉండేందుకు ఇల్లు కూడా లేక బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్ళదీసింది. నా అన్నవాళ్లు పట్టించుకునే పరిస్థితి లేకపోవడంతో మూడు రోజులు పస్తులతో గడిపిన పరిస్థితిని తెలుసుకున్న కనుమూరి హరిచంద్రారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆ వృద్ధురాలికి నివాసయోగ్యమైన ఇంటిని నిర్మించి ఇచ్చేందుకు ముందుకు వచ్చింది. ఈ క్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్మోహన్ రెడ్డి జన్మదినం సందర్భంగా ఆ ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేశారు. గూడూరు టౌన్, రూరల్ సిఐలు దశరథరామారావు శ్రీనివాసరెడ్డిల ఆధ్వర్యంలో ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.



## అర్జీదారుల కోసం భవనం

గూడూరు సర్కిల్ పోలీస్‌స్టేషన్ మరియు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్లో అర్జీదారులకోసం కనుమూరు హరిచంద్రారెడ్డి దాతృత్వంతో కొత్త భవనానికి శ్రీకారం చుట్టారు. ఇటీవల ఈ భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో గూడూరు సబ్‌కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ, గూడూరు డిఎస్పీ ఎం.రాజగోపాలరెడ్డి, పట్టణ సిఐ దశరథరామారావు, ఎస్సైలు సైదులు, బ్రహ్మానాయుడు, కనుమూరు చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు అనిల్‌కుమార్, పెంచల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వైజేపీ లయన్స్ సేవలు ప్రశంసనీయం

- షేక్ రియాజ్ అహ్మద్



వైజేపీ లయన్స్ క్లబ్ సేవలు ప్రశంసనీయమని లయన్, ఏపి డిప్లొమా ఇంజనీర్స్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు షేక్ రియాజ్‌అహ్మద్ అన్నాడు. గూడూరు డిఎన్‌ఆర్ కమ్యూనిటీ హాలులో ఈనెల 20న జరిగిన వైజేపీ లయన్స్ క్లబ్ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ వైజేపీ లయన్స్ క్లబ్ తరపున ప్రజలకు ఉపయోగపడే ఎన్నో సేవాకార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. దివంగత డాక్టర్ వై.జే.ప్రభాకర్‌రెడ్డి 79వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయన్నాడు. ఈ సందర్భంగా పేదలకు, నిరాశ్రయులకు డాక్టర్ సి.ఆర్.రెడ్డి దాతృత్వంతో పలసరుకులు అందజేశారు. వైజేపీ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు నవీన్ జయకుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్, ఆర్.వి.రావు, ఎం.రమణయ్య, గురునాథం, రూపేష్‌రెడ్డి, ఎస్‌ఎల్‌ఎన్ స్వామి, బండ్ల సుధాకర్, సోమిశెట్టి చెంచురామయ్య, వాకాటి రామ్మోహన్, మస్తాన్, మురళీనాయుడు, మంజులాదేవి పాల్గొన్నారు.

### శ్రీకృష్ణ సేవా సమితి
## పలసరుకుల పంపిణీ



శ్రీ కృష్ణ సేవా సమితి అధ్యక్షుడు, అంతర్జాతీయ మానవ హక్కులు మరియు నేర వ్యతిరేక సేవా సంస్థ రాష్ట్ర కార్యదర్శి, రొటేరియన్ బి.శ్యామసుందర రావు(మయూరి శ్యామ్ యాదవ్) సూచనల మేరకు గూడూరు చవటపాలెంలో ఉన్న వృద్ధ దివ్యాంగ బ్రాహ్మణుడు రామచంద్రస్వామికి, సిరామిక్ కాలేజీ ఆంజనేయస్వామి గుడి పక్కన ఉన్న వృద్ధ మహిళ చిన్నమ్మకు ప్రతి నెలా ఇచ్చే పలసరుకులు, కూరగాయలను ఈనెల 22వ తేదీ ఇవ్వటం జరిగింది. మయూరి శ్యామ్‌యాదవ్ తరపున పవన్ ఈ పలసరుకులను అందజేయడం జరిగింది.

### జనవరి 9, 10 తేదీల్లో ..
## క్రికెట్ పోటీలు



గూడూరు పట్టణంలోని డిఎన్‌ఆర్ కమ్యూనిటీ హాల్‌లో ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో వివిధ పార్టీల నాయకులు, అధికారులు, మీడియా ప్రతినిధులు, క్రీడాకారులు ఈ నెల 20న సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనవరి 9, 10తేదీల్లో క్రికెట్ పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పట్టణ సి.ఐ జి.దశరథరామారావు, ఎస్సై బ్రహ్మానాయుడు, ప్రతినిధులు కె.చంద్రశేఖర్, చేవూరు విజయ మోహన్‌రెడ్డి, పులిమి శ్రీనివాసులు, బి.శ్రీనివాసులు, తాళ్ళూరు శ్రీనివాసులు, రూపేష్‌రెడ్డి, రాఘవరెడ్డి, బాబు, పి.శ్రీనివాసులురెడ్డి, సురేంద్రనాథ్‌రెడ్డి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

### చోరీ కేసులో..
## ముద్దాయి అరెస్టు



చిల్లకూరు మండలం బూదనం గ్రామం, పాత హరిజన వాడలో పసల నాగమ్మ ఇంట్లో జరిగిన చోరీ కేసులో ముద్దాయి కాళ్ళ నరేష్‌ను చిల్లకూరు పోలీసులు ఇటీవల అరెస్టు చేశారు. అతని వద్దనుండి 2,40,000 రూపాయల విలువచేసే పది తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకొన్నారు. మరి కొంత బంగారాన్ని రాజమండ్రి మణప్పురం ఫైనాన్స్ నుండి రికవరీ చేయవలసిందిగా గూడూరు రూరల్ సి.ఐ.శ్రీనివాసరెడ్డి తెలిపాడు. మీడియా సమావేశంలో చిల్లకూరు ఎస్సై బాబి, కానిస్టేబుళ్ళు రాజు, వెంకటేశ్వర్లు, నావూరయ్య, చిరంజీవి, ఆదినారాయణ, విష్ణు ఉన్నారు.

# భక్తిశ్రద్ధలతో 'సుబ్రహ్మణ్య షష్ఠి'

## - ఆలయాలకు పెద్దసంఖ్యలో తరలివచ్చిన భక్తులు

సుబ్రహ్మణ్య షష్ఠి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈనెల 20న జిల్లాలోని శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవాలయాల్లో విశేషపూజలు జరిగాయి. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయాలకు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ ధనుర్మాసంలో స్కంధ షష్ఠిరోజు ఎంతో పుణ్యప్రదమైనది కనుక సుబ్రహ్మణ్యస్వామికి సర్వత్రా విశేష పూజలు చేశారు. ఆలయాలను విద్యుద్దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. జిల్లాలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాల్లో ప్రముఖమైన మల్లాంలోని శ్రీవళ్ళీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి ఆలయంలో సుబ్రహ్మణ్య షష్ఠి సందర్భంగా స్వామివార్లకు ప్రత్యేక అలంకారాలు చేసి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఆ తర్వాత శాంతి కల్యాణం నిర్వహించి భక్తులకు అన్నదానం చేశారు. అదేవిధంగా నెల్లూరు శివార్లలో ఉన్న కనుపర్తిపాడు ఆలయంలో 108 కలశాలతో మూలవర్లకు అభిషేకం చేసి, శ్రీవళ్ళీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివార్ల కళ్యాణోత్సవాన్ని కన్నులపండువగా నిర్వహించారు. స్వామివార్లకు వేడుకగా పూలంగిసేవ చేశారు. సూళ్ళూరుపేటలోని శ్రీ నాగేశ్వరస్వామి దేవాలయంలో కొలువై ఉన్న శ్రీ సుబ్రహ్మణ్యస్వామి గుడిలో కల్యాణోత్సవం జరిగింది. ఆ తర్వాత భక్తులందరికీ అన్నప్రసాద వితరణ చేశారు. నాయుడుపేటలోని బ్రాహ్మణవీధిలో ఉన్న శ్రీ వళ్ళీ దేవసేన సమేత షణ్ముఖ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఉదయం నుంచి స్వామివార్లకు పంచామృత అభిషేకం చేసి అష్టోత్తర, షోడశోపచార పూజలను నేత్రపర్వంగా నిర్వహించి మధ్యాహ్నం భక్తులకు అన్నదానం, సాయంత్రం సామూహిక కుంకుమార్చన పూజలు చేశారు. వరికుంటపాడు మండలంలోని పామూరుపల్లిలో ఉన్న శ్రీ సుబ్బరాయుడుస్వామి ఆలయంలో షష్ఠి మహోత్సవం వేడుకగా జరిగింది. స్వామివార్లకు ప్రత్యేకపూజలు చేసి పుష్పాభిషేకం నిర్వహించారు. గ్రామస్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. రాత్రికి అంగరంగవైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు.

### దుత్తలూరులో 2 నుంచి..

# సంక్రాంతి క్రికెట్ పోటీలు

సంక్రాంతి పండుగ వచ్చిందంటే చాలు... యువతలో అందులోనూ ఆటపాటల పట్ల ఇష్టం ఉన్నవాళ్ళలో ఉత్సాహం పెరిగిపోతూ ఉంటుంది. ఆటపాటలతో సంక్రాంతిని సందడిగా జరుపుకోవడం అన్ని ప్రాంతాల్లోనూ ఆనవాయితీగా వస్తోంది. ఈ నేపథ్యంలో ఉదయగిరి నియోజకవర్గంలోని దుత్తలూరులో క్రికెట్ పోటీలుపెట్టి యువతను ఉత్సాహపరిచేందుకు దుత్తలూరు యూత్ క్రికెట్ క్లబ్ అసోసియేషన్ నిర్ణయించుకుంది. జనవరి 2 నుంచి 13వతేదీ దాకా జరిగే ఈ పోటీల్లో విజేతలకు మొదటి బహుమతిగా 10వేలు, రెండవ బహుమతి 7వేలు, మూడవ బహుమతి 3 వేల రూపాయలతో పాటు టోర్నమెంట్‌లో ప్రతిభ కనపరచినవారికి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ తదితర నగదు బహుమతులు కూడా ఇస్తామని. ఈనెల 28వ తేదీలోగా ఎంట్రీలు పంపాలని, వివరాలకు 94402 10734 ఫోన్ నెంబరుకు సంప్రదించాలని నిర్వాహకుడు కంభం కృష్ణారెడ్డి తెలిపాడు.

# సర్వత్రా క్రిస్మస్ వేడుకలు

- ఏసుక్రీస్తు పాటలతో మార్మోగుతున్న చర్చిలు
- నెల్లూరులో అద్వితీయంగా.. క్రీస్తు గాన జయంతి

**క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని ఈనెల 25న జిల్లాలోని అన్ని చర్చిల్లో ముందస్తు క్రిస్మస్ (ప్రీ క్రిస్మస్) వేడుకలు ఎంతో భక్తిశ్రద్ధలతో ఆనందోత్సాహాలతో జరుగుతున్నాయి. అన్ని చర్చిల్లో ప్రభువైన ఏసుక్రీస్తును ఆరాధిస్తూ ప్రత్యేక ప్రార్థనలు ప్రారంభమయ్యాయి. అనేక చర్చిల్లో ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. పలు క్రైస్తవ సంఘాల నేతృత్వంలో ఈ సందర్భంగా పేదలకు తమవంతు సేవా కార్యక్రమాలు చేస్తూ తమ సేవాభావం చాటుకుంటున్నారు.**



నగరంలోని డౌనీహాల్‌లో ఏసుక్రీస్తును కీర్తిస్తూ గానం చేస్తున్న గాయక బృందం

### నెల్లూరు డౌనీహాల్‌లో క్రీస్తు గాన జయంతి :

నెల్లూరు నగరంలోని విఆర్‌సి కూడలి వద్ద ఉన్న తెలుగు బాప్టిస్ట్ చర్చి డౌనీహాల్‌లో క్రిస్మస్ వేడుకల్లో భాగంగా ఈనెల 20న జరిగిన క్రీస్తు గాన జయంతి సంగీత విభావరి అందరినీ భక్తిభావంతో పులకింపజేసింది. సంఘ కాపరి రెవ.జి.మనోహర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కె.ఎస్ క్రిస్టోఫర్, గంటా రచించిన క్రీస్తు భక్తిగీతాలు అందరినీ బాగా ఆకట్టుకున్నాయి. గుర్రం సుధాకర్‌రావు, జమ్ముల జయకుమార్, జి. అరుణకుమార్, బిల్లీ శ్యాంసన్‌లు ఈ గీతాలకు స్వరకల్పనతో పాటు సంగీత సహకారం అందజేశారు. డౌనీహాల్ గాయక బృందం అత్యద్భుతంగా ఆలపించిన భక్తిగీతాలు అందరి కరతాళ ధ్వనులందుకున్నాయి. గంటా థామస్ మౌంట్‌బాటన్ ఈ గానజయంతి కార్యక్రమానికి వ్యాఖ్యాతగా వ్యవహరించారు. హెబ్రోన్ బిలీవర్స్ అసెంబ్లీస్ చర్చి సీనియర్ పాస్టర్ రెవ.బి.డేవిడ్ దయాసాగర్ దైవ సందేశాన్ని వినిపించారు. గత అయిదు దశాబ్దాలుగా ప్రతి ఏటా క్రిస్మస్‌ను పురస్కరించుకుని ఈ సంగీత విభావరిని నిర్వహిస్తున్నామని, సంఘసభ్యులు ఎంతో భక్తిభావంతో ప్రభువైన ఏసుక్రీస్తు జననాన్ని వివరించే రచనలు చేసి సంగీతం సమకూర్చి ఆలపించడం ఈ కార్యక్రమం ప్రత్యేకత అని కార్యదర్శి అరుణ్‌కుమార్ వివరించారు. తొలితరం గాయకులైన కీ.శే రెవ.విక్టర్ ఇమాన్యుయేల్, గుర్రం సుధాకర్‌రావు, కెవిన్ క్రిస్టఫర్, ఎన్‌వై జాన్‌ల స్ఫూర్తితో అమ్ముల జయకుమార్ ప్రేరణతో నేటికీ ఈ కార్యక్రమాన్ని నిరంతరాయంగా కొనసాగిస్తున్నామన్నారు. కోశాధికారి విబి విజయభాస్కర్‌తో పాటు కమిటీ సభ్యులు, సంఘసభ్యులు, భక్తులు ఈ సంగీత విభావరిలో పాల్గొని ఆనందపరవశులయ్యారు.

### సూళ్ళూరుపేటలో :

సూళ్ళూరుపేటలో ఈనెల 20న పరిశుద్ధ మిఖాయేలు లూథరన్ చర్చిలో జరిగిన ముందస్తు క్రిస్మస్ వేడుకలు సంబరంగా జరిగాయి. బిషప్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పలువురు బాలలు ఏసుక్రీస్తు ప్రభువు జనన వృత్తాంతాన్ని నాటక ప్రదర్శన ద్వారా అత్యద్భుతంగా ప్రదర్శించి అందరి ప్రశంసలు అందుకున్నారు. ఏసుక్రీస్తు జననం సకల మానవాళికి పాపవిమోచనం కల్పించడం మానవులకు గొప్ప వరమని కొనియాడారు. ప్రతిఒక్కరు శాంతి సామరస్యాలతో, ప్రేమతత్వంతో జీవించాలని బిషప్ చంద్రశేఖర్ కోరారు. ఈ వేడుకల్లో సంఘ ఛైర్మన్ లూథరయ్యతో పాటు పాస్టర్ కీర్తికిరీట్, అపోలో డాక్టర్ ఎ.రినీటా, కె.శీలాకుమారి పాల్గొన్నారు.

### ఆత్మకూరు..సంగంలలో :

అదేవిధంగా ఆత్మకూరు పట్టణంలోని సెంట్రల్ తెలుగు బాప్టిస్టు చర్చి సంఘం వారు చర్చి తరఫున సుమారు వందమంది పేదమహిళలకు ఎంపిడిఓ ఐజాక్ చేతుల మీదుగా చీరలు పంపిణీ చేశారు. ఎడ్మమ్మ మెమోరియల్ క్రిస్టియన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 20న సంగం దళితవాడలోని పలువురు పేదలకు సంఘస్తులు చీరలు పంపిణీ చేశారు.

# మహిమాన్విత దేవత... కోడూరు వేళాంగణి మాత

**భక్తులకు కొంగుబంగారంగా, మహా మహిమాన్వితమైన దేవతగా ప్రసిద్ధి చెందిన వేళాంగణి మాత ఆలయం నెల్లూరుజిల్లా తోటపల్లి గూడూరు మండలంలోని కోడూరు సముద్రతీరంలో ఉంది. చల్లటి గాలులు వీచే సాగర తీరంలో.. ఎంతో ఆహ్లాదకరమైన ఆధ్యాత్మిక సుప్రశాంత వాతావరణంలో ఉన్న వేళాంగణి మాత ఆలయం జిల్లాలో గత నాలుగు దశాబ్దాలుగా క్రైస్తవ సోదరులకు ఆరాధ్య మందిరంగా వెలుగొందుతోంది. ఎంతో పవిత్రమైన ఈ ఆలయం క్రైస్తవ సోదరులతో పాటు, హిందువులకు కూడా ప్రీతిపాత్రమైన ఆలయంగా పూజలందుకుందుకుంటోంది. కులమతాలకతీతంగా, మతసామరస్యానికి ప్రతీకగా, శాంతి-ప్రేమ సౌహార్ధభావాలకు చిహ్నంగా అలరారుతూ కోడూరు వేళాంగణిమాత ఆలయం దినదిన ప్రవర్ధమానమవుతోంది.**

దక్షిణ భారతదేశంలో ఎంతో ప్రఖ్యాతిగాంచిన 'వేలాంకన్ని' మాత ఆలయం ఎంతోకాలం నుంచి తమిళనాడులోని నాగపట్నం జిల్లాలో సముద్రతీరంలో ఉంది. లోకరక్షకుడికి మాతృమూర్తి అయిన మేరీమాత ఆ చర్చిలో ఆరోగ్యమాతగా వెలసి భక్తజనుల్ని కాపాడుతూ ఉంది. బాల ఏసుతో వెలసిన పవిత్రమైన కన్య కనుక 'వేలాంకన్ని' అనే పేరు వచ్చింది. ప్రాంతాలకు, మతాలకు అతీతంగా ఈ చర్చి దేశవ్యాప్తంగా పేరెన్నికగన్నది. 16వ శతాబ్దంలో ఈ చర్చిని పోర్చుగీసు వారు నిర్మించినట్లు తెలుస్తోంది. అయితే, ఇతర దూర ప్రాంతాల్లోని భక్తజనులు ఆర్థిక స్తోమతు లేనివారు, నిరుపేద భక్తజనులు అంత దూరం వెళ్ళి తమిళనాడులోని వేలాంకన్ని మాత ఆలయం దర్శించుకోవడం కష్టసాధ్యం కనుక, అక్కడికి వెళ్ళలేని దైవజనులు ఇప్పుడు నెల్లూరు జిల్లాలోని కోడూరు సముద్ర తీరంలో ఉన్న పరమ పవిత్రమైన వేళాంగణి మాత సన్నిధికి వస్తుండడంతో కోడూరు వేళాంగణిమాత మందిరం మరింతగా ప్రసిద్ధి చెందుతూ ఉంది.






మన దేవాలయాలు 26

### కోడూరు తీరంలో అత్యద్భుతమైన చర్చి :

గతంలో తమిళనాడులోని తంజావూరు జిల్లాలో ఉన్న వేళాంగణి అనే గ్రామంలో మేరిమాత కొంతమంది దివ్యాంగులకు ప్రత్యక్షమై తన మహిమలతో వారికి స్వస్థత చేకూర్చడంతో మేరీమాత కాలక్రమంలో 'వేళాంగణి మాత'గా భక్తుల పూజలందుకుంటోందని ప్రతీతి. ఆ తర్వాత కాలంలో.. నెల్లూరు జిల్లా తోటపల్లి గూడూరు మండలంలోని కోడూరు సముద్రతీరంలో వెలసిన వేళాంగణి మాత ఆలయం ఎంతో మహిమాన్వితమైన ఆలయంగా ప్రసిద్ధి చెందింది. కోడూరు సముద్ర తీరంలో ఒకప్పట్లో రోమన్ కాథలిక్ చర్చి ఉండేదని, ఆ తర్వాత 1982 ప్రాంతంలో రోమన్ కాథలిక్ చర్చిల బిషప్ పూదోట బాలస్వామి బిషప్ ఇక్కడ ఎంతో భక్తితో వేళాంగణి మాతగా పేరొందిన మేరిమాత ప్రతిరూపాన్ని ప్రతిష్ఠించారని, ఆ తర్వాత 1987లో అత్యద్భుతమైన రీతిలో చర్చిని నిర్మించారని చెప్తుంటారు. ఆహ్లాదకరమైన ప్రకృతి వాతావరణంలో అత్యంత అద్భుతంగా ఈ చర్చి నిర్మాణం జరిగింది. నాటి నుంచి ఈ ఆలయం ఎంతో ప్రఖ్యాతి చెందుతోంది.

### ఆరోగ్యమాతగా.. వేళాంగణి మాత :

భక్తజనులకు కల్పవల్లిగా, అందరి కష్టాలను తీర్చే కరుణామయిగా కోడూరు వేళాంగణి మాత నిత్యం భక్తుల పూజలందుకుంటోంది. వేళాంగణి మాతను దర్శించుకుంటే ఎలాంటి కష్టాలైనా తీరిపోతాయని, ఎంతటి దీర్ఘవ్యాధులైనా సమసిపోతాయని, తమ జీవితాల్లో ఎలాంటి ఆపదలు కలుగకుండా ఆ చల్లనితల్లి అనుగ్రహించి కాపాడుతూ ఉంటుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. అంతేకాదు, మానసిక-శారీరక బాధలకు స్వస్థత చేకూర్చే దేవతగా.. ఆరోగ్యమాతగా కూడా కోడూరు వేళాంగణి మాత ప్రసిద్ధి. దీంతో నిత్యం భక్తజనులు ఈ మందిరానికి వచ్చి వేళాంగణి మాతను దర్శించుకుని తరిస్తుంటారు. ప్రత్యేకించి క్రిస్మస్ పర్వదినం వేడుకల్లో ఈ మందిరం విద్యుద్దీపకాంతులతో శోభాయమానంగా ఉంటుంది. పెద్ద సంఖ్యలో భక్తజనులు ఈ వేడుకలకు తరలివస్తుంటారు. ఈ మందిరంలో ప్రతి ఏడాది ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో రాష్ట్ర వ్యాప్తంగా భక్తులు కులమతాలకు అతీతంగా ఇక్కడకు వచ్చి ప్రార్థనలు చేస్తుంటారు. వేళాంగణి మాత జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రతి ఏటా ఆగస్టు 29 నుంచి సెప్టెంబరు 9వ తేది వరకు ఇక్కడ వేళాంగణి మాత జన్మదినోత్సవాలు ఎంతో వైభవంగా నిర్వహిస్తుంటారు. ముఖ్యంగా సెప్టెంబరు 7 నుంచి 9వ తేది దాకా జరిగే ప్రత్యేక పూజలు ప్రార్థనలకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివస్తుండడంతో కోడూరు తీరం భక్తజనులతో కళకళలాడుతూ ఉంటుంది.

# కళ్యాణ వైభోగం...!





## విజయ్ మణిదీప్ - దివ్య

ఏసియన్ ప్రైవేట్ లిమిటెడ్ (ACT) మేనేజింగ్ డైరెక్టర్ బొమ్ము వెంకట సుబ్బారావు- ప్రమీలారాణిల కుమారుడు **విజయ్ మణిదీప్ - దివ్య** ( విజయవాడ వాస్తవ్యులు వన్నెంరెడ్డి నరసింహారావు- అరుణశ్రీ ) ల కుమార్తె వివాహం డిసెంబర్ 17 వ తేదీ విజయవాడ లో జరిగింది. రాష్ట్ర నీళ్ల మంత్రి అనిల్‌కుమార్‌యాదవ్ ఈ వివాహ వేడుకలో పాల్గొని కొత్త దంపతులను ఆశీర్వదించాడు.








**రిసెప్షన్ :** డిసెంబర్ 20వ తేదీ మధ్యాహ్నం నెల్లూరులో జరిగిన రిసెప్షన్ వేడుకలో నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, కాకాణి గోవర్ధన్‌రెడ్డిలతో పాటు ఇంకా జిల్లాకు చెందిన పలువురు శాసన సభ్యులు, రాజకీయ, వ్యాపార ప్రముఖులు, జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు ఇతర అనేకమంది అధికార అనధికార ప్రముఖులు పాల్గొని నవ వధూవరులను దీవించారు. విజయ్‌దీప్ - దివ్యలకు 'లాయర్' అభినందన ఆశీస్సులు.

## కోటి మందికి.. 'ఇంటి' పండుగ


(మొదటి పేజీ తరువాయి)

అది జరిగి తీరాల్సిందే. జగన్ ది కూడా అదే గుణం. తాను ఏదైనా అనుకుంటే అది జరగాల్సిందే! ఈ పట్టా పంపిణీ కార్యక్రమానికి ఆదినుండి హంసపాదులాగ అవరోధాలు ఎదురవుతూనే వున్నాయి. దాదాపుగా 33లక్షల కుటుంబాలకు(సుమారు కోటి మందికి) నేరుగా లబ్ధిచేకూరేలా స్థలాలు, ఇళ్లు పంపిణీ చేయడం ద్వారా సుమారు కోటి మంది గుండెల్లో ఆయన గూడు కట్టుకుంటాడు. ఇదే ప్రతిపక్షాలకు నచ్చలేదు. కోర్టుల ద్వారా ఈ కార్యక్రమానికి అడ్డుకట్ట వేస్తూనేవచ్చారు. ఎట్టకేలకు అన్ని అడ్డంకులు అధిగమించి ఈ పట్టాల పందారం జరుపబోతున్నాడు.



## స్వప్న-శశిభరత్



నెల్లూరుజిల్లా ఆయిల్ మిల్లర్స్‌కి పెద్దదిక్కుగా, నగర రాజకీయాలలో కీలకపాత్ర పోషించే రాజకీయ వేత్తగా మంచి మనసున్న వ్యక్తిగా అందరికీ సుపరిచితుడు సన్నపురెడ్డి పెంచలరెడ్డి - పద్మావతిల కనిష్ఠ పుత్రిక **డాక్టర్ స్వప్న - డాక్టర్ శశిభరత్‌కుమార్‌రెడ్డి**(కర్నూలు జిల్లా ఓర్వకల్లు వాస్తవ్యులు చెన్నూరు రాజమోహన్‌రెడ్డి - విష్ణుతులసీదేవిల కుమారుడు)ల కల్యాణం డిసెంబర్ 9న నెల్లూరులో జరిగింది. జిల్లాకు చెందిన అనేకమంది రాజకీయ, రాజకీయేతర ప్రముఖులు, వ్యాపారవేత్తలు అధికసంఖ్యలో పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. నవ దంపతులకు 'లాయర్' శుభదీవెనెలు.

## సూర్యప్రతాప్ - శ్రావ్య



భారతీయ జనతాపార్టీ నాయకుడు, ఆత్మకూరు వాస్తవ్యుడు కుడుముల సుధాకర్‌రెడ్డి - సుజాతల కుమారుడు **సూర్యప్రతాప్‌రెడ్డి - శ్రావ్య** (యల్లాయపాళెం గ్రామ వాస్తవ్యులు దేవిరెడ్డి శ్రీనివాసులరెడ్డి - పద్మజల కుమార్తెల పెళ్ళి డిసెంబర్ 20వ తేదీ నెల్లూరులో జరిగింది. కొత్త జంటకు 'లాయర్' శుభాశీస్సులు.

# వివేకా ఆశయాల బాటలో నడుస్తాం



మాజీ ఎమ్మెల్యే, స్వర్గీయ ఆనం వివేకానందరెడ్డి ఆశయాల బాటలో నడుస్తామని మాజీమంత్రి, వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి చెప్పారు. వివేకా 70వ జయంతి సందర్భంగా ఈనెల 23న నెల్లూరు ఏసి సెంటర్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నెల్లూరు అభివృద్ధికి వివేకా చేసిన కృషిని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఆనం జయకుమార్‌రెడ్డి, కొడవలూరు ధనుంజయరెడ్డి, చాట్ల నరసింహారావు, నరసింహులు గౌడ్ తదితరులతో పాటు ఆనం అభిమానులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తొలుత రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఆ తర్వాత బాలాజీనగర్‌లో అన్నదానం చేశారు.

# జమిలి దిశగా అడుగులు

(మొదటి పేజీ తరువాయి)

భారత ప్రధాని నరేంద్రమోడీ అభిప్రాయం. 2014లో ఆయన అధికారంలోకి వచ్చిన తొలినాళ్ళలోనే జమిలి అంశాన్ని తెరపైకి తెచ్చారు. అప్పటినుండి వివిధ పార్టీల అభిప్రాయాలను సేకరించడంతోపాటు ఎన్నికల నిర్వహణ విషయంలో సాధ్యాసాధ్యాలను కూడా ప్రధాన ఎన్నికల కమిషన్ పరిశీలిస్తూ జమిలి ఎన్నికల విషయంలో పూర్తిస్థాయి అధ్యయనం చేసి ఇది సాధ్యమే అని నిర్ధారించుకున్న తరువాతే 2022లోనైనా జమిలి ఎన్నికలకు తాము సిద్ధం అని ప్రకటించిందని విశ్లేషకుల అభిప్రాయం.

ఇప్పటికే పీకల్లోతు మునిగిపోయి ఉన్న కాంగ్రెస్‌పార్టీ చిరునామాను గల్లంతు చెయ్యాలన్న భాజపా ఆలోచనకి కూడా జమిలి మంచి వేదిక కాబోతుందని, పలు రాష్ట్రాలలో బలంగా ఉన్న స్థానిక పార్టీలతో దోస్తీ చేసి అక్కడ కూడా తాము అధికారంలోనైనా ఉండాలి లేదా తమదే రెండవ ప్రధానపార్టీగా ఉండాలన్నదే కమలనాథుల ఆలోచనగా ఆ పార్టీ శ్రేణులే చెప్తున్నారు. వచ్చే ఏడాది 5 రాష్ట్రాలలో ఎన్నికలు జరగనున్నాయి. అలాగే అనేక స్థానిక ఎన్నికలకు కూడా అవకాశం ఉంది. ఇలాంటి తరుణంలో 2022లోనైనా జమిలి ఎన్నికలకు తాము సిద్ధం అని ప్రధాన ఎన్నికల కమిషన్ ప్రకటించడం, ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

హిందుత్వ నినాదంతో రామమందిర నిర్మాణం, అదే సమయంలో మరోవైపు తాము ఇతర మతాల వారికి వ్యతిరేకం కాదనేలా సందేశం ఇస్తూ బాబ్రీ మసీదు నిర్మాణానికి సన్నాహాలు, ఇంకొక వైపు తరచూ దేశ సరిహద్దులను సందర్శిస్తూ సైన్యంలో ఆత్మస్థైర్యం నింపడం, తీసుకునే అన్ని నిర్ణయాల్లో పారదర్శకతతో సమర్ధనీయమైన నాయకత్వం చేతిలో ఈ దేశం ఉందన్న భరోసా ప్రజలకు కల్పించడం వంటి అంశాలతో పార్టీని బలోపేతం చేయాలన్నది భారతీయ జనతా పార్టీ అధినాయకత్వం ఆలోచనగా కనిపిస్తుందని అదే ఆలోచనతో 'ఒకే దేశం ఒకే ఎన్నిక' నినాదంతో సాధ్యమైనంత త్వరగా జమిలి గంట మోగించడం ఖాయమని విశ్లేషకుల అంచనా.

### డిగ్రీ ఫలితాల్లో

# సత్తా చాటిన కృష్ణచైతన్య విద్యార్థులు

## యూనివర్శిటీ స్థాయిలో రికార్డ్

విక్రమసింహపురి యూనివర్శిటీ తాజాగా విడుదల చేసిన డిగ్రీ రెండవ, నాల్గవ సెమిస్టర్ ఫలితాల్లో నెల్లూరు కృష్ణచైతన్య కళాశాల విద్యార్థులు తమ సత్తా చాటారు. యూనివర్శిటీ స్థాయిలో రికార్డు ఫలితాలు సాధించారు.



ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్లు డా.ఆర్‌వి కృష్ణారెడ్డి, పి.చంద్రశేఖర్‌రెడ్డిలు విద్యార్థులను అభినందించారు. బిఎస్సీలో డి.నిషిత 95.5 శాతం, షేక అఫ్రీన్, ఎం.యమునిక, ఎ. పూజాప్రవలిక, పి.గాయత్రి 99 శాతం, షేక్ జరీనా, పి.నిహారిక 98.5 శాతం ఉత్తమ మార్కులు సాధించారన్నారు. అదేవిధంగా బిబిఏలో ఆర్.శ్రావణి, డి.ద్వారకానాథ్‌రెడ్డి 99శాతం, యు.రమ్య 97 శాతం, ఎంపిఎల్ హారిక 96 శాతం, బిసిఏలో వై.శిరీష, ఆర్.పూజాకుమారి, జి.నిఖిల, సిహెచ్ మౌనిక 99 శాతం, ఆర్.మీనాక్షి, షేక్ ఫర్జానా, ఎస్.వెన్నెల 98శాతం వంతున ఉత్తమ మార్కులు తెచ్చుకున్నారని తెలిపారు. బికాంలో బి.హరిత 94శాతం, కె.రుబీనా సుల్తానా, పి.శ్రీధర్‌రెడ్డి, పి.అమృత 93శాతం ఫలితాలు సాధించి విజయదుందుభి మోగించారని వారు పేర్కొన్నారు. మొత్తంగా 175 మంది విద్యార్థులకు 95శాతం పైగా మార్కులు వచ్చాయని, 725 మంది విద్యార్థులకు 90 శాతం మార్కులు, 1950 మంది విద్యార్థులు 75శాతం మార్కులు సాధించి యూనివర్శిటీ స్థాయిలో తమ కళాశాల విద్యార్థులు అగ్రస్థానంలో నిలిచారని కళాశాల డైరెక్టర్లు పేర్కొన్నారు. అంతేకాక గణితంలో 770 మంది, స్టాటిస్టిక్స్‌లో 125మంది, అకౌంట్స్‌లో 49 మంది, ఫిజిక్స్‌లో 12మంది, ఎలక్ట్రానిక్స్‌లో 40 మంది, కెమిస్ట్రీలో 21 మంది, బయోటెక్‌లో అయిదుగురు విద్యార్థులు నూటికి నూరు మార్కులు సాధించి యూనివర్శిటీస్థాయిలో అద్భుతాలు సృష్టించారని తెలిపారు. ఈ అభినందన కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లతో పాటు డీన్ బి.సుధారాణి, ప్రిన్సిపాల్ ఎన్.కృష్ణకుమార్, ఎస్ నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

వీక్షణం

# మహిళాపథం

-మంజీర

దిశ, సఖి, భరోసా, చేరువ, మన కోసం, క్యాంపస్ కాప్స్, రైజింగ్ స్టార్స్, సహాయ, మార్పు, మేలుకొలుపు... మొత్తం పది అంశాలు. సమాజాన్ని జాగృతం చేయడానికి ఉద్దేశించిన ఈ ప్రణాళిక మహిళల రక్షణ కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన వినూత్న కార్యక్రమంలోనివి. ఈ పది అంశాలతో మొదలైన వంద రోజుల కార్యక్రమం పేరు 'మహిళా మార్చ్ ఎట్ 100 రోజులు'. ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ ఆధ్వర్యంలో రూపొందిన ఈ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఈనెల మొదటి వారంలో ప్రారంభోత్సవం చేశారు.

## నేటికీ అదే స్ఫూర్తి

అంతర్జాతీయ మహిళాదినోత్సవం అంటూ ఒక తేదీ (మార్చి8) ఖరారై వందేళ్ళు దాటి మరో దశాబ్దం కూడా దాటింది. మహిళలు తమ కనీస హక్కుల కోసం గళమెత్తి రోడ్డెక్కిన ఆ రోజున... ఉద్యమించిన వాళ్ళకు తమ ఉద్యమం భవిష్యత్తు తరాల మహిళలకు ఒక చుక్కాని అవుతుందని తెలియదు. మితిమీరిన పనిగంటలు, గాలి వెలుతురు వంటి కనీస సౌకర్యం లేని పని వాతావరణం, మగవాళ్లతో పోలిస్తే సగానికి మించని వేతనం... ఇవన్నీ ఆ రోజున భూమాత వంటి క్షమామూర్తులైన మహిళలు పిడికిలి బిగించడానికి దారి తీసిన పరిస్థితులు. నాటి స్ఫూర్తిని కొనసాగిస్తూ ప్రపంచవ్యాప్తంగా మహిళాలోకం మార్చి ఎనిమిదవ తేదీని 'మహిళా దినోత్సవం'గా జరుపుకుంటోంది. ఇప్పటి వరకు మహిళా దినోత్సవాన్ని మహిళలు స్వచ్ఛందంగా నిర్వహించుకోవడం, ప్రభుత్వ కార్యాలయాలు ఉద్యోగినులకు ఆటలు, పాటలు వంటి ఆటవిడుపు కార్యక్రమాల వరకే పరిమితమైంది. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మహిళా దినోత్సవాన్ని మహిళాభ్యుదయం కోసం ప్రత్యేకమైన పాలనాంశంగా రూపొందించింది. ప్రభుత్వ పాలనలో మహిళా దినోత్సవాన్ని భాగంగా మలిచింది. గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు 'మహిళా సాధికారత-భద్రత-రక్షణ' విషయంలో ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టిని కేంద్రీకరించింది. బాలికల నుంచి వృద్ధుల వరకు సమాజంలో అన్ని వర్గాల మహిళలను ఇందులో భాగస్వామ్యం చేయడానికి రూపొందించిన అంశాలే పైన చెప్పుకున్న పది అంశాలు. గ్రామాలు, పట్టణాలు, నగరాలలో సమావేశాలు ఏర్పాటు చేసి ఈ విషయాల పట్ల మహిళలకు అవగాహన సదస్సులు నిర్వహిస్తారు. ఈ సమావేశాల్లో సభ దృష్టికి వచ్చిన నిర్దుష్టమైన సమస్యల పరిష్కారానికి సంబంధిత ప్రభుత్వ విభాగాలు చర్యలు చేపడతాయి.

## మహిళా శ్రేయస్సే లక్ష్యం

**దిశ:** బాలికలు, మహిళలకు తమ కోసం రూపొందించిన చట్టాలపై అవగాహన కల్పించడానికి ఉద్దేశించిన కార్యక్రమం పేరు దిశ. ఇందులో 'దిశ' బిల్లు, దిశ యాప్, దిశ పోలీస్‌స్టేషన్ల గురించి క్షుణ్ణంగా వివరిస్తారు. పోలీసులు, న్యాయవాదులు, స్వచ్ఛంద సంస్థలు, డీఆర్‌డీఏ, వైఎస్ఆర్ క్రాంతిపథం ప్రతినిధులు హాజరవుతారు.

**సఖి:** ఉద్యోగినులు (ప్రభుత్వ, ప్రైవేటు రంగాలు) ఎదుర్కొంటున్న ప్రత్యేక సమస్యలను చర్చిస్తారు. జిల్లా స్థాయి ప్రభుత్వ శాఖలన్నీ పాల్గొంటాయి. బాధిత మహిళల ఫిర్యాదుల స్వీకరణ-పరిష్కారం కూడా ఇందులో భాగమే.

**భరోసా:** మహిళలు, బాలికల హాస్టళ్లు, హోమ్‌లను ఆకస్మికంగా తనిఖీ చేయడం, సౌకర్యాలను సమీక్షించడం, సమస్యలను గుర్తించడం, గుర్తించిన సమస్యలను పరిష్కరించడం ఇందులో ముఖ్యమైనవి.

**చేరువ:** మహిళల కోసం ప్రభుత్వం రూపొందించిన సంక్షేమ పథకాల గురించి సామాన్య మహిళలకు ప్రాథమిక అవగాహన కూడా తక్కువగానే ఉంటోంది. 'మహిళా మార్చ్' కార్యక్రమం ద్వారా ఈ వంద రోజుల్లో ప్రతి గ్రామంలోనూ ఈ అవగాహన సదస్సు జరుగుతుంది.

**మనకోసం:** మహిళా చైతన్యం కోసం సైకిల్ ర్యాలీ చేపట్టి, మహిళల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ల పట్ల అవగాహన, వారి కోసం నిర్వహిస్తున్న కార్యక్రమాలను వివరించడం జరుగుతుంది.

**క్యాంపస్ కాప్స్:** ఇది విద్యార్థినులకు ఉద్దేశించిన అంశం. విద్యాసంస్థల్లో విద్యార్థినులతో రక్షణ టీమ్‌లను ఏర్పాటు చేస్తారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కాలేజీల్లోనూ ఈ కాప్స్ టీమ్‌లను ఏర్పాటు చేస్తారు.

**రైజింగ్ స్టార్స్:** ఏ రంగంలోనైనా అసాధారణ కృషితో స్ఫూర్తిదాయకంగా నిలిచిన మహిళలను గుర్తించి వారికి సన్మానం చేయడం ఇందులో ప్రధానమైనది. అన్ని ప్రభుత్వ శాఖల్లోనూ ఈ అభినందన కార్యక్రమాలు జరుగుతాయి.

**సహాయ:** నిరాశ్రయ మహిళల కోసం ఉద్దేశించిన కార్యక్రమం ఇది. గూడు లేక వీధుల్లో, బస్టాండ్‌లు, రైల్వేస్టేషన్లలో బతుకు వెళ్లదీస్తున్న మహిళలు, వ్యభిచార గృహాల్లో చిక్కుకు పోయిన మహిళలను కాపాడడం కోసం రూపొందించిన కార్యక్రమం.

**మార్పు:** మద్యంపై సమరశంఖం పూరించడమే 'మార్పు'. బెల్టు షాపులు, అక్రమ మద్యం రవాణా, అక్రమ మద్యం తయారీ కేంద్రాలను గుర్తించి వాటిని అరికట్టడం. మహిళల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మద్యపాన నిషేధాన్ని విజయవంతంగా అమలు చేయడంలో మహిళలను భాగస్వాములను చేయడం జరుగుతుంది.

**మేలుకొలుపు:** మహిళా మార్చ్ ఎట్ 100 రోజుల కార్యక్రమంలో చివరిది 'మేలుకొలుపు'. ఇది సైబర్ నేరాల బారిన పడకుండా మహిళలు తమను తాము కాపాడుకోవడానికి దోహదం చేసే కార్యక్రమం. సోషల్ మీడియా స్నేహాలతో మోసపోకుండా చైతన్యవంతం చేయడం ప్రధానమైనది.

వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేపట్టిన ఈ వినూత్నమైన కార్యక్రమంలో మహిళా సాధికారత-సమానత్వ సాధనతోపాటు మహిళల అక్రమ రవాణా, మహిళా పారిశ్రామికవేత్తలు-వాళ్లకు ఎదురయ్యే సవాళ్లు, పని కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లి మోసపోతున్న మహిళల రక్షణ, ఇళ్లలో పని చేసే ఆడవాళ్ల సమస్యల మీద ప్రత్యేక దృష్టి పెట్టడం జరుగుతుంది. మహిళల రక్షణ కోసం ప్రభుత్వం తీసుకునే చర్యలతోపాటు మహిళలను 'స్వీయ రక్షణ' పట్ల చైతన్యవంతం చేయడం కూడా ప్రధానంగా ఉంటుంది. ఇప్పటికే కార్యరూపం దాల్చిన ఈ మహిళా మార్చ్ ఎట్ 100 రోజులు కార్యక్రమం... పై అంశాలన్నింటినీ రాబోయే ఏడాది అంతర్జాతీయ దినోత్సవం నాటికి పరిపూర్ణంగా పూర్తి చేసే ప్రయత్నంలో ఉంది. మహిళా దినోత్సవం అంటే ఫ్యాషన్ షోలు, ముగ్గులు, వంటల పోటీలతో సరిపుచ్చే వేడుకలు కాదని, 'పోరాడి సాధించుకున్న విజయాన్ని గుర్తుచేసుకోవడం, దాని నిరంతర కర్తవ్యాలను కొనసాగించడం' అని నిర్వచనం చెప్తోంది జగన్మోహన్‌రెడ్డి పాలన.

# అసెంబ్లీలో ప్రతి సభ్యుని హక్కులు కాపాడుతాం

**- సభాహక్కుల కమిటీ ఛైర్మెన్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి**



అసెంబ్లీలో ప్రతి సభ్యుని హక్కులు కాపాడాలని నిర్ణయం తీసుకున్నామంటూ ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సభాహక్కుల కమిటీ ఛైర్మెన్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి చెప్పారు. ఈనెల 23న కాకాణి అధ్యక్షత్వంలో శాసనసభ ఆవరణలో తొలిసారిగా అసెంబ్లీ ప్రివిలేజ్ కమిటీ భేటీ జరిగింది. అనంతరం కాకాణి మీడియాతో మాట్లాడుతూ టిడిపి ఎమ్మెల్యేలు అచ్చెన్నాయుడు, నిమ్మల రామానాయుడుపై ఇటీవల అసెంబ్లీలో ఇచ్చిన ప్రివిలేజ్ మోషన్‌పై విచారణ చేపట్టామని, వారి వివరణ కోసం పది రోజులు సమయం ఇచ్చామని తెలిపారు. కమిటీ ముందుకు వచ్చిన నాలుగు అంశాలపై విచారణ జరిపామన్నారు. టిడిపి ఫిర్యాదులు విచారించలేదన్నది అవాస్తవమని, కమిటీ సమావేశంలో టిడిపి సభ్యుడు కూడా ఉన్నాడని, వారు తమ నిర్ణయంతో ఏకీభవించారని కూడా చెప్పారు. టిడిపి సభ్యులు చేసిన ఫిర్యాదులను కూడా తమ దృష్టికి తెచ్చారని, స్పీకర్ ఎప్పుడు రెఫర్ చేస్తే అప్పుడు విచారిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు శిల్పా చక్రపాణిరెడ్డి, మల్లాది విష్ణు, చిన అప్పల నాయుడు పాల్గొన్నారు.










Edited, Published, Printed & Owned by THUNGA SIVAPRABHATH REDDY, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at Roopa Graphics, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-THUNGA SIVAPRABHATH REDDY, Managing Editor : T.BHARATHI REDDY, e-mail: lawyerpatrika@gmail.com